నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ బుధవారం 17-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:241 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

భారత మహిళా జట్టును,
తీరుగ నడిపించినట్టి దీప్తీశర్మన్
హారతులిడి శ్లాఘించెద
పారించగ పెవిలియనుకు పాకిస్థానున్ !!

(టీ ట్వంటీ క్రికెట్ లో పాకిస్థాన్ పై భారత మహిళా జట్టు తిరుగు లేని విజయం సాధించింది. అందుకే భారత మహిళా జట్టును, దానిని నడిపించిన దీప్తీశర్మను అందరూ ప్రశంసిస్తున్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



**చురక**

రాష్ట్ర కేంద్ర పార్టీలే
రాజకీయ పవరు
హైద్రాబాద్ మెట్రోకు
అడ్డు ఇంకా ఎవరు.
నువ్వంటే నువ్వనే
నెట్టుకునే తొందులు
ఆగిపోతే అభివృద్ధి
అన్నీ తలవంపులు

-వేల్పుల నారాయణ
9440433475



# బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లు అందుబాటులో ఉంచాలి

-సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 16: ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

**వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..**

వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు.

అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు.

**కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి..**

రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం-కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, జూన్ 16: తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు.

మావోయిస్టులు ఇక లేరు..

మావోయిస్టులు చివరికి సాధించింది ఏంటి అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తుపాకీ గొట్టంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. అభం శుభం తెలియని మైనర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. చివరికి మావోయిస్టు సంస్థని నిషేధానికి గురయ్యేలా చేశారని వ్యాఖ్యానించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్ర నేతలు కూడా గుర్తించారని.. కేంద్రానికి సహకరించి చాలామంది లొంగిపోయారన్నారు. మావోయిస్టులు ఇక లేరని అన్నారు. మావోయిస్టు భావజాలంతో ఏదైనా సాధిద్దాం అనే ఆలోచన ఉన్న వ్యక్తులు ఆలోచనలను విరమించుకోవాలని సూచించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# టీజీ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ

హైదరాబాద్, జూన్ 16: తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌ను చర్చలకు ఆహ్వానించామని.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్ అండ్ బీలో రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టిందని.. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని విమర్శించారు. యాదగిరిగుట్ట నిర్మించామని గొప్పలు చెబుతున్నారని, గుట్ట బిల్లులు కూడా రూ.350 కోట్లు బకాయిలు పెట్టారన్నారు.

బిల్లుల కోసం ఈనెల 18న చలో హైదరాబాద్‌కు తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చిందని మంత్రి తెలిపారు. సీఎంతో మాట్లాడి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చామన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరగా.. ఈరోజు సాయంత్రం వరకు చర్చించుకుని నిర్ణయం చెబుతామని వారు చెప్పారన్నారు. పత్రికల్లో వార్తల కోసం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు తమపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బట్టకాల్చి మీద వేస్తే కాలిపోతామని అనుకుంటున్నారని అన్నారు. 'మేం ఎంతకు కాంట్రాక్టులు ఇచ్చామో? చూస్తే హరీశ్ రావు తాను పొరపాటుగా మాట్లాడినట్లు ఒప్పుకుంటారు' అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# నాకు సర్టిఫికెట్ అవసరం లేదు: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, జూన్16: తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. మంగళవారం న్యూఢిల్లీలో మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. దేశంలో మెట్రో రైలు ఫేజ్-2, 3లకు కేంద్రం ఎలా సహకరిస్తోందో.. హైదరాబాద్‌కూ అలాగే సహకారమందిస్తోందని చెప్పారు.

మెట్రో రైలు ప్రాజెక్ట్ ఆపాలని తానేందుకు చెబుతానంటూ ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు కిషన్‌రెడ్డి. 'నేను వద్దంటే ఎక్కడా ప్రాజెక్టులు ఆగవు. నేనెప్పుడూ తెలంగాణ ప్రయోజనాల కోసమే పని చేశాను. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఒక లక్షా 75 వేల కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి మా బాధ్యత' అని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు.

తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అనాలోచితంగా మాట్లాడుతున్నారన్న ఆయన.. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ ఏమీ అవసరం లేదన్నారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు సూచించారు. తాను సీఎం రేవంత్‌కు కాదని.. ప్రజలకు జవాబుదారీని అని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తాను పోరాటం చేశానని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఢిల్లీలో రెండుసార్లు ధర్నా చేశానన్నారు. బిల్లు ఆమోదం పొందాకే ఆమరణ దీక్షను విరమించానని వివరించారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ కోరితేనే తాను అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు.

మెట్రో విస్తరణ కోసం చురుగ్గా పనిచేయాలని.. గతంలోనే సీఎం రేవంత్‌కు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. రేవంత్ అనుకుంటేనో.. తాను అడ్డుకుంటేనో ప్రాజెక్టులు ఆగవని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అలా చేస్తుందేమో.. కానీ బీజేపీ అలా కాదని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

# ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యం: మంత్రి తుమ్మల

కామారెడ్డి, జూన్16: రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే



4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం 13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు.

స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెందవద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం..



హైదరాబాద్, జూన్ 16: హైదరాబాద్‌లోని మూసాపేట్ గూడ్స్ షెడ్ ప్రాంతంలో ఈరోజు (మంగళవారం) భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎలక్ట్రానిక్ వాహనాలు నిల్వ చేసే గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాం మొత్తం దట్టమైన పొగతో కమ్ముకుపోగా, మంటలు భారీగా ఎగసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ గోదాంలో ఎలక్ట్రానిక్ వాహనాలు నిల్వ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

**అదుపులోకి మంటలు..**

కాసేపటి తర్వాత మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదంలో 60 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే 8 నెలల నుంచి ఈ సర్వీస్ సెంటర్ గోదామును యాజమాన్యం మూసివేసింది.

# ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి నలుగురు సైనికులకు గాయాలు..

## సాధారణ తనిఖీ నిర్వహిస్తుండగా పేలుడు



న్యూఢిల్లీ, జూన్ 16:జమ్మూ కాశ్మీర్‌లో విషాదం జరిగింది. సాధారణ గస్తీ, తనిఖీ నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి నలుగురు సైనికులు గాయపడ్డారు. ఈ ఘటన జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లా, నౌషేరా సెక్టార్ పరిధిలో మంగళవారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమావోన్ రెజిమెంట్ యూనిట్‌కు చెందిన సైనికులు సాధారణ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక మల్టీ మోడ్ గ్రెనేడ్ ప్రమాదవశాత్తు పేలిపోయింది.

ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న నలుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురు సైనికులతోపాటు ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) కూడా ఉన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఉన్నతాధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స కొనసాగుతోంది. వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. వారంలో ఇది రెండో ఘటన. సాధారణంగా ఆర్మీ సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో గస్తీ, నిఘా నిర్వహిస్తుంటారు. నిరంతరం సరిహద్దులో ఈ తరహా తనిఖీలు అక్కడ మామూలే. పైగా రాజౌరి జిల్లాలోని ఘటన జరిగిన ప్రాంతం చాలా సున్నితం కావడంతో కొన్ని ఆయుధాలతో తనిఖీ చేస్తుండగా పేలుడు సంభవించింది.

కొన్నిసార్లు ప్రమాదవశాత్తు ఆయుధాలు పేలు సైనికులు మరణించిన ఘటనలు జరుగుతున్నాయి. గత వారం కూడా బారాముల్లా జిల్లాలోని యురి సెక్టార్‌లో ప్రమాదవశాత్తు ఒక గ్రెనేడ్ పేలింది. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిచగా, అప్పటికే సైనికులు మరణించినట్లు వైద్యులు తెలిపారు.


# నేషనల్ హైవేపై రెండు ట్రక్కులు ఢీ.. ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం



న్యూ ఢిల్లీ, జూన్ 16: ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైవేపై ఝార్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతి వేగం కారణంగా అదుపుతప్పింది.

వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. వాహనాలు ఢీకొన్న సమయంలో డీజిల్ ట్యాంకర్ పగలడం వల్ల ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. రెండు ట్రక్కులకు పూర్తిగా మంటలు అంటుకున్నాయి. డ్రైవర్లు బయటపడే అవకాశమే లేకపోయింది. ఇది గమనించిన ఇతర వాహనదారులు వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.

వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కానీ, ఆలోపే ట్రక్కుల్లో ఇద్దరు డ్రైవర్లు కాలిపోయి మరణించారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# నేల ఎడారీకరణకు అడ్డుకట్ట వేస్తేనే ఉత్పాదకత పెరుగుతుంది !

## (17 జూన్ "ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా)

నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించబడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపీ ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించిపోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది.

ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం-2026 ఇతివృత్తం:

భూ క్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోతపడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది. నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 17 జూన్ రోజున "ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినోత్సవం" పాటించాలని 1994లో ఐరాస తీర్మానించడం, 1995 నుంచి పాటించడం జరుగుతున్నది. 2026 ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం ఇతివృత్తంగా "రేంజ్‌ల్యాండ్స్ : గుర్తించండి. గౌరవించండి. పునరుద్ధరించండి" అనబడే అంశాన్ని తీసుకొని కొలంబియాలో సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రకృతికి పునాది సారవంతమైన నేల. ఇలాంటి ఆరోగ్యకర భూములను మానవ, ప్రకృతి ప్రమేయాలతో నిస్సారం, నిర్వీర్యం చేయడం జరుగుతోంది. ఇలాంటి నేల క్షీణత మరికొంత కాలం కొనసాగితే శాశ్వతంగా పనికి రాని ఎడారులుగా మారి పోతాయని గమనించాలి. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి.

### హరిత విప్లవంతో ఆహార భద్రత, అటు తర్వాత?!

ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో "హరిత విప్లవం" రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలిమన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. అవగాహన లేమి, అశాస్త్రీయ సాగు పద్ధతులతో సారవంతమైన నేలలు నిస్సారమై ఎడారి భూములుగా మారడాన్ని నేల ఎడారీకరణ అంటారు. ఎడారీరకణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది. అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రకమైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి.

### ఎడారీరకణలో పేదరికం, ఆకలి చావులు:

నేల ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలిమన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది. వ్యవసాయ నేలలకు సారం అందించని యెడల క్రమంగా శుష్క భూములుగా మారుతూదిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్ధతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి.

మానవ కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలను అందించడానికి సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. నేల సారాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, మట్టి మర్యాదను గౌరవిస్తూ, మట్టిలోంచి మాణిక్యాలను పండిద్దాం.



-మధుపాళీ
9949700037

# దేశ ఐక్యత అనేది ఆధునిక భావన కాదు... అదొక ప్రాచీన నాగరికతా వాస్తవం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 16:భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ నేడు న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో 'అగస్త్యర్-ది యూనిఫైయర్' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా దేశ నాగరికత, ఐక్యత గురించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. జాతీయ సమగ్రత గురించి చర్చించేటప్పుడు సాధారణంగా రాజులు, రాజకీయ వ్యవస్థల గురించే ఎక్కువగా గుర్తుచేసుకుంటారు. కానీ, దేశ ఐక్యతకు నిజమైన నిర్మాతలు ఇక్కడి సాధువులు, రుషులేనని తెలిపారు. వారిలో అగస్త్య మహర్షి (అగస్త్యర్) భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఏకత్వా నికి గొప్ప ప్రతీకగా నిలుస్తారని కొనియాడారు.

ఉత్తర, దక్షిణ భారత సాంప్రదాయాలు రెండింటిలోనూ సమానంగా పూజలందుకునే అగస్త్య మహర్షి.. హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు విస్తరించి ఉన్న అఖండ భారతావని ఐక్యతకు నిదర్శనమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. తమిళ నాడులోని 'పోతిగై కొండలు', 'కావేరి నది' ఇప్పటికీ అగస్త్య మహర్షి జ్ఞాపకాలను గుర్తుచేస్తూనే ఉంటాయన్నారు. తమిళ వ్యాకరణం, తమిళ 'సంగం' సంప్రదాయాల అభివృద్ధికి అగస్త్యుడు చేసిన విశేష కృషిని ప్రస్తావిస్తూ.. ఆయన ఉత్తర, దక్షిణ భారత సంస్కృతులను కలిపే ఒక గొప్ప వారధి అని అభివర్ణించారు.

భారతదేశ భాషలు ఒకదానికొకటి పోటీదారులు కావని, శతాబ్దాల తరబడి పరస్పర గౌరవం, సాంస్కృతిక మార్పిడి ద్వారా ఒకదానినొకటి సంపన్నం చేసుకున్న సోదరి భాషలని అగస్త్యుడి వారసత్వం నిరూపిస్తోందని ఉపరాష్ట్రపతి అన్నారు.

తమిళం వల్ల చాలా మంది ప్రయోజనం పొందినప్పటికీ, తమిళ భాషాభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేసిన వారికి నేడు తగిన గుర్తింపు లభించడం లేదంటూ సీపీ రాధాకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమిళ తాతగా పేరుగాంచిన వీ స్వామి నాథ అయ్యర్ చేసిన సేవలు, త్యాగాలను ప్రస్తావిం చారు. తమిళ భాషకు స్వామినాథ అయ్యర్ చేసిన సేవ గురించి ప్రజలకు తగినంతగా తెలియజే యలేదని విచారం వ్యక్తం చేశారు. అంతరించిపోయే స్థితిలో ఉన్న అమూల్యమైన తమిళ సాహిత్య సంపదను కాపాడి, వెలుగులోకి తెచ్చిన మహనీయుడు స్వామినాథ అయ్యర్ అని ఉపరాష్ట్రపతి కొనియాడారు.

భారతదేశ ఐక్యత అనేది ఈ మధ్య కాలంలో ఏర్పడిన ఆధునిక భావన కాదని, ఇది వేల సంవత్సరాలుగా ఇక్కడి రుషులు, జ్ఞానుల ద్వారా పోషించిన ప్రాచీన నాగరికత, వాస్తవికత అని ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. అగస్త్య మహర్షి జీవితం, ఆయన అందించిన వారసత్వమే ఈ నిత్యసత్యానికి సజీవ సాక్ష్యాలని ఆయన పేర్కొన్నారు.

ప్రతి భాషకు దానికంటూ ఒక ప్రత్యేకమైన బలం, గొప్పతనం ఉంటాయని గుర్తుచేసిన ఉపరాష్ట్రపతి.. కొందరు వ్యక్తులు భాషా పరమైన విభజనలను ప్రోత్సహిస్తూ, సమాజంలో అనవసరమైన చర్చలను, విచ్ఛిన్నకర ధోరణులను పెంచి పోషిస్తున్నారని హెచ్చరించారు.

దేశాన్ని విడదీయడం ఏ శక్తీ వల్ల కాదని ఆయన స్పష్టం చేశారు. మన దేశ సంస్కృతి, నాగరికత వారసత్వంపై యువతలో సానుకూల అవగాహనను పెంపొందించేలా చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

తమిళనాడులో అగస్త్య మహర్షి పేరు మీదుగా అగస్తీశ్వరార్ ఆలయాలుగా పిలవబడే వందకు పైగా దేవాలయాలు ఉన్నాయని ఉపరాష్ట్రపతి గుర్తు చేశారు. కాశీ (వారణాసి)తో పాటు తమిళనాడులోనూ ఒకే పేరుతో ఆలయాలు ఉండటం దేశ సాంస్కృతిక ఐక్యతకు నిలువెత్తు నిదర్శనమని ఆయన కొనియాడారు.

బ్రిటిష్ వారి పరిపాలన లేకపోతే భారతదేశం ఒక్కటిగా ఉండేది కాదనే వాదనను ఉపరాష్ట్రపతి పూర్తిగా తిరస్కరించారు. బ్రిటీష్ పాలనతో సంబంధం లేకుండానే, దేశ సంస్కృతి, నాగరికత ఎల్లప్పుడూ అన్ని ప్రాంతాల ప్రజలను, తరతరాలుగా ఒకరితో ఒకరిని ముడివేసి ఉంచాయని ఆయన పేర్కొన్నారు.

ఈ పుస్తక రచయితలను ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. భారత్‌లోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ అనే నాలుగు దిక్కుల్లో అగస్త్య మహర్షికి సంబంధించిన సంప్రదాయాలు, కథలు, ఆధారాలు ఎంత విస్తృతంగా ఉన్నాయనే విషయాన్ని వారు ఎంతో పరిశోధన చేసి, అత్యంత నిశితంగా ఈ పుస్తకంలో పొందుపరిచారని పేర్కొన్నారు. అగస్త్యుడి గొప్పతనాన్ని, దేశ సాంస్కృతిక ఐక్యత సందేశాన్ని ప్రపంచవ్యాప్త పాఠకులకు చేరవేయడంలో ఈ పుస్తకం ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఈ అద్భుతమైన పుస్తకాన్ని ప్రచురించినందుకు 'కలైమగల్' పత్రికను ఉపరాష్ట్రపతి అభినందించారు. గత 95 సంవత్సరాలకు పైగా కలైమగల్ పత్రిక తమిళ సాహిత్యాన్ని, సంస్కృతిని, వారసత్వాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడుతూ, ప్రోత్సహిస్తూ విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు. ఎంతోమంది తమిళ పండితులు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు, జాతీయ నాయకులు తమ రచనల ద్వారా ఈ పత్రిక నాణ్యతను, విశ్వసనీయతను ఎంతగానో పెంచారని ఆయన గుర్తుచేసుకున్నారు.

ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ శ్రీ సునీల్ అంబేకర్, కలైమగల్ పత్రిక సంపాదకులు శ్రీ కీలంబూర్ శంకర సుబ్రమణియన్, సీనియర్ రచయిత, జర్నలిస్ట్ శ్రీ మాలన్, పుస్తక రచయితలు శ్రీ ఓ.శ్యామ భట్, డాక్టర్ ఎంఎన్ సుధ, పుస్తకాన్ని తమిళంలోకి అనువదించిన ప్రొఫెసర్ కళ్యాణితో పాటు పలువురు ప్రముఖులు, అతిథులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణం..

### -కూచిపూడిలో కలెక్టర్ డీకే బాలాజీ పిలుపు
### -యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని ప్రజలకు సూచన

అమరావతి, జూన్ 16:ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని, సుసంపన్నమైన, ఆనందమయమైన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.

అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం-2026 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'యో గాంధ్ర- 2026' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూచిపూడి గ్రామంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ తదితరులు పాల్గొని యోగా ప్రియులను ఉత్సాహపరిచారు.

ఈ సందర్భంగా యోగాసనాలు చేయించి, అందరి చేత యోగా సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు.




అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో యోగాకు విశిష్ట స్థానం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. గత ఏడాది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు.

విశాఖపట్నం సముద్ర తీరంలో ప్రధానమంత్రి సమక్షంలో సుమారు ఐదున్నర లక్షల మందికి పైగా ఒకేసారి యోగాసనాలు చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. యోగా ద్వారా ఏకాగ్రత పెరగడం, మానసిక ఒత్తిడి తగ్గడం, శరీరానికి చురుకుదనం రావడం వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు.

ప్రస్తుతం పెరుగుతున్న మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులను నియంత్రించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. రోగనిరోధక శక్తిని పెంపొం దించడంలో కూడా యోగా ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

ముఖ్యంగా మహిళలు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమం సాధారణ కార్యక్ర మం కాదని, ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు చేపట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద నివారణ ఆరోగ్య ఉద్యమమని తెలిపారు.

దేశంలో మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జీవనశైలిలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# యోగా చేస్తేనే ఆరోగ్యకర జీవనం..

### -జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్

శ్రీకాకుళం, జూన్ 16:ఆరోగ్యకరమైన జీవనానికి యోగాసనాలు అత్యంత అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ అన్నారు. పర్యాటక ప్రాంతమైన డచ్ భవనం వద్ద నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షం కురిసినప్పటికీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంత వర్షంలోనూ యోగా కోసం మైదానాన్ని సిద్ధం చేయడం అభినందనీయమన్నారు.

ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వాటన్నింటికీ సహజసిద్ధమైన, శాశ్వతమైన పరిష్కారం యోగానేనని చెప్పారు. ప్రాచీన భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం యోగాసనాలేనని, క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని వివరించారు.

ఆరోగ్యం బాగుంటేనే శరీరం, మనసు, జీవన విధానం చురుకుగా ఉంటాయని అన్నారు. వ్యాయామం చేయకుండా శరీరం ఆరోగ్యంగా కనిపించినా, వైద్య పరీక్షల ద్వారా మాత్రమే అసలు పరిస్థితి తెలుస్తుందని పేర్కొన్నారు. వయసు పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు సహజమని, యువ వయసులో శరీరం భరించే అలవాట్లు వృద్ధాప్యంలో సాధ్యం కాదన్నారు.

గత రెండు నెలలుగా తాను ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నట్లు వెల్లడించారు. వ్యాయామం శరీరాన్ని మాత్రమే కాదు, మనస్సును కూడా చురుకుగా ఉంచుతుందని చెప్పారు. జూన్ 7 నుంచి ప్రారంభమైన యోగా కార్యక్రమం ఆరోగ్యకరమైన జీవన విధానానికి మంచి అవకాశమని పేర్కొన్నారు.

ప్రతిరోజూ ఉదయం కార్గిల్ పార్క్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో యోగా నిర్వహిస్తున్నామని, జూన్ 21 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 15 నుంచి 30 నిమిషాలైనా ఏదో ఒక శారీరక వ్యాయామం అలవాటు చేసుకుంటే అది జీవితంలో భాగమవుతుందని చెప్పారు. యోగా కేవలం అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు మాత్రమే కాకుండా, ఆ తర్వాత కూడా కొనసాగించాలని ప్రజలకు సూచించారు.

క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగై రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఆరోగ్యం బాగుంటేనే జీవితం ఆనందంగా సాగుతుందని పునరుద్ఘాటించారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా ఆయుష్ అధికారి ఉత్తమ్ రాజ్ రాణా మాట్లాడుతూ, యోగాసనాలు శరీర దృఢత్వాన్ని పెంచడంతో పాటు కండరాలు, కీళ్లకు బలాన్నిస్తాయని అన్నారు. యోగా ద్వారా శరీరం మరింత వశ్యతను పొందుతుందని చెప్పారు.

# ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

### -జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
### -ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య వారధిగా సమావేశం నిర్వహణ

అమరావతి, జూన్ 16:జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించి, పరిష్కరించేందుకు కృషిచేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను, అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు 92 అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా ఏఎన్ఎం (గ్రేడ్-3)లపై పని ఒత్తిడి, అన్ని శాఖల్లో నాలుగో తరగతి ఉద్యోగ ఖాళీల భర్తీ, ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ పటిష్ట అమలు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం, అర్హులైన వారికి కారుణ్య నియామకాలు, సరైన విచారణ లేకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం, జిల్లాస్థాయిలో క్రీడల నిర్వహణ, బస్సు డిపోల్లో మహిళా ఉద్యోగులకు సౌకర్యాల కల్పన తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ? జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ అనేది ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య సామరస్యపూర్వకమైన సంబంధాలను పెంపొందించడానికి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ఏర్పాటైన ఒక అధికారిక వేదికని.. ఉద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కారాలను కనుగొనడానికి ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, మిగిలిన అంశాలను సమావేశ మినిట్స్ రూపంలో రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

సమావేశంలో డీఆర్వో లక్ష్మీనరసింహంతో పాటు ఏపీ ఎన్‌జీజీవోస్ అసోసియేషన్, స్టేట్ టీచర్స్ యూనియన్, ఏపీ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్-1938, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ వెహికల్స్ డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్, ఆల్ ఏపీ గవర్నమెంట్ క్లాస్ - 4 ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్, ఏపీ కోపరేటివ్ సర్వీస్ అసోసియేషన్, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, ఏపీ వీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఏపీ వీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

# వర్షం వచ్చినా భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు..

–ఇంద్రకీలాద్రిపై వర్షం ప్రభావం పరిశీలన
–పలు ప్రాంతాల్లో పర్యటించిన చైర్మన్, ఈవో
–భక్తుల ఇబ్బందులపై ఆరా
–నీరు నిల్వ ఉండకుండా చర్యలకు ఆదేశం
–డ్రైన్లు పూడిపోకుండా ప్రత్యేక చర్యలు
–పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల దృష్టి

విజయవాడ, జూన్ 16: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షం ప్రభావాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ




(గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని పలు ప్రాంతాలను సందర్శించిన వారు వర్షం కారణంగా భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని సంబంధిత అధికారు లకు పలు సూచనలు చేశారు. వర్షపు నీరు ఆలయ ప్రాంగణం లో ఎక్కడా నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

అలాగే డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ డ్రైన్లు, కాలువలు పూడిపోకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షం ప్రభావిత ప్రాంతాలను గుర్తించి వెంటనే సమస్యల పరి ష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచిం చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో మహిళ సామాజిక బహిష్కరణ

న్యూఢిల్లీ, జూన్ 16:ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా మహుల్దిహా గ్రామంలో ఓ వృద్ధురాలు 12 ఏళ్ల పాటు సామాజిక బహిష్కరణను అనుభవిస్తూ ప్రాణాలు కోల్పోవడం, ఆమె మరణించిన తర్వాత కూడా గ్రామస్థులు ఆమె అంత్యక్రియలు నిర్వహించడానికి కూతురికి కనీస సహాయం అందించకపోవడంపై జాతీయ మానవ హక్కుల సంఘం తీవ్రంగా స్పందించింది. మీడియాలో వచ్చిన ఈ కథనాన్ని కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించింది. చివరకు స్థానిక యంత్రాంగం రంగంలోకి దిగి కొన్ని స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో వృద్ధురాలి అంత్యక్రియలను పూర్తి చేసింది.

వార్తా కథనాల్లోని అంశాలు నిజమైతే, అవి స్పష్టంగా మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తాయని కమిషన్ పేర్కొంది. ఈ ఉదంతంపై తీవ్రంగా స్పందించిన ఎన్‌హెచ్ఆర్‌సీ.. ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

2026, జూన్ 11న వెలువడిన మీడియా కథనం ప్రకారం.. వృద్ధురాలి కుమార్తె గతంలో వేరే కులానికి చెందిన వ్యక్తితో కొంతకాలం పాటు ఇల్లు వదిలి వెళ్లిపోయింది. ఈ కారణంతో గ్రామస్థులు ఆ కుటుంబానికి జరిమానా విధించారు. ఆ జారిమానాను చెల్లించలేకపోవడంతో గ్రామస్థులంతా కలిసి ఆ వృద్ధురాలి కుటుంబాన్ని ఏకంగా 12 సంవత్సరాల పాటు సామాజికంగా బహిష్కరించారు.

# గుజరాత్‌లోని అహ్మదాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో రూ.140 కోట్ల కవచ్ ప్రాజెక్టుకు భారతీయ రైల్వే ఆమోదం

న్యూ ఢిల్లీ, జూన్ 16:రైలు ప్రయాణ భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమ రైల్వే పరిధిలోని గుజరాత్ అహ్మదాబాద్ డివిజన్ పరిధిలో 48 బ్లాక్ సెక్షన్లలో 598 కిలోమీటర్ల మేర 'కవచ్ వెర్షన్ 4.0' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం రూ. 140 కోట్ల నిధులను మంజూరు చేశారు. భారతీయ రైల్వేలోని మిగిలిన అన్ని మార్గాల్లో ఎల్‌టీఈ ఆధారిత కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌తో కూడిన కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేసే సమగ్ర పథకంలో భాగంగా ఈ పనులకు అనుమతి లభించింది.

అహ్మదాబాద్ డివిజన్‌లో సుమారు 702 కిలోమీటర్ల మేర కవచ్ పనులకు ఇప్పటికే అనుమతులు లభించాయి. తాజాగా మంజూరైన ప్రాజెక్టుతో ఈ డివిజన్‌లోని మిగిలిన అన్ని విభాగాలు కూడా పూర్తిగా కవచ్ పరిధిలోకి రానున్నాయి. దీంతో స్వదేశీ సాంకేతికతతో తయారైన ఈ రైలు రక్షణ వ్యవస్థను డివిజన్ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడానికి మార్గం సుగమమైంది.

రైళ్ల నిర్వహణ భద్రతను పెంపొందించేందుకు స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థే ఈ కవచ్. ఇది రైళ్లు ప్రమాదవశాత్తూ సిగ్నల్ దాటి ముందుకు వెళ్లకుండా నిరోధించడంతోపాటు ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు స్వయంచాలితంగా బ్రేకులు వేస్తుంది. అత్యంత కీలక సమయాల్లో రైలు వేగాన్ని నియంత్రిస్తుంది. రైళ్లు ఒకదానికొకటి ఢీకొనే ప్రమాదాలను పూర్తిగా నివారించడానికి ఈ కవచ్ వ్యవస్థ ఎంతగానో సహాయపడుతుంది. రైల్వే భద్రతను పటిష్టం చేయడానికి, రైళ్ల కార్యకలాపాలను ఆధునీకరించడానికి భారతీయ రైల్వే చేస్తున్న నిరంతర ప్రయత్నాల్లో భాగంగా ఈ కవచ్ వ్యవస్థను దేశవ్యాప్తంగా క్రమంగా విస్తరిస్తోంది.

# ఏఎస్ఐ, డెన్మార్క్ జాతీయ మ్యూజియం మధ్య ఒప్పందం..నీట మునిగిన చారిత్రిక డేనిష్ నౌక అరాసండ్‌పై పరిశోధనలు

న్యూఢిల్లీ, జూన్ 16:భారత పురాతత్వ సర్వే సంస్థ (ఏఎస్ఐ)తో పాటు కోపెన్‌హాగెన్‌లోని డెన్మార్క్ జాతీయ పురావస్తుశాలకు చెందిన 'ఎన్‌జోర్డ్ – సెంటర్ ఫర్ మారిటైం అండ్ అండర్ వాటర్ కల్చరల్ హెరిటేజ్' ఒక అవగాహన ఒప్పందాన్ని (ఎమ్ఓయూ) కుదుర్చుకున్నాయి. సముద్ర జలాల్లో మునిగిపోయిన చరిత్రాత్మక డేనిష్ నౌక అరాసండ్ అవశేషాలను కలిసికట్టుగా వెదికి, వాటి జాబితాను రూపొం దించడానికి సముద్ర జలాల్లో పురావస్తు ప్రాజెక్టు నిర్వహణకు ఈ ఒప్పందం దోహదపడుతుంది. అరాసండ్ క్రీ.శ. 1619లో పుదుచ్చేరిలోని కరైకల్ తీర సమీపంలో ఓ దుర్ఘటన కారణంగా సముద్ర జలాల్లో మునిగింది.

భారత్‌కు చేరిన మొదటి డేనిష్ నౌకగా అరాసండ్‌కు నౌకావాణిజ్య చరిత్రలో ఒక చెప్పుకోదగ్గ స్థానం ఉంది. ఇది భారతీయ జలాల్లోకి ప్రవేశించిన కొద్దిసేపటిలోనే, కరైకల్ సమీపాన ప్రమాదానికి లోనైంది. ఈ కారణంగా డెన్మార్క్, భారత్ మధ్య ప్రాథమిక నౌకావాణిజ్య సంబంధాలు, 17వ శతాబ్దం మొదట్లో హిందూ మహాసముద్రంలో నౌకల రాకపోకలతో పాటు వాణిజ్యంతో ముడిపడిన విస్తృత చరిత్రపై అవగాహనను పెంచుకోవడానికి పురాతత్వ పరంగా ఇది ఒక ప్రధాన వనరుగా మారింది.

ఎమ్ఓయూ షరతుల్లో పేర్కొన్న ప్రకారం.. నౌక శిథిలాల్లో మిగిలి ఉంటాయని భావిస్తున్న సామగ్రిని అన్వేషించడానికి ఆధునిక సాంకేతికతలతో పాటు శాస్త్రీయ పద్ధతులను కూడా ఉపయోగించి బహిర్గత పురావస్తు సర్వేపై ఈ ప్రాజెక్టు దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఈ అన్వేషణను భారతీయ పురాతత్వ సర్వే సంస్థకు చెందిన అండర్‌వాటర్ ఆర్కియాలజీ వింగ్ ఆధ్వర్యంలో డెన్మార్క్‌కు చెందిన జాతీయ మ్యూజియం సహకారంతో చేపడతారు. ఈ సహకారం అండంవాటర్ ఆర్కియాలజీ వింగ్‌కు సంబంధించినంత వరకు ఒక ప్రధాన ప్రస్థానమని చెప్పవచ్చు. ఓ అంతర్జాతీయ సంస్థతో కలిసి ఈ సంస్థ చేపడుతున్న మొదటి సంయుక్త పురావస్తు ప్రాజెక్టు ఇది. భారత్, డెన్మార్క్ మధ్య అండర్ వాటర్ కల్చరల్ హెరిటేజ్‌తో ముడిపడిన పరిశోధన రంగంలో విద్యా, విజ్ఞానశాస్త్ర సహకారం ఈ భాగస్వామ్యంతో బలోపేతమవుతుంది. అంతర్జాతీయ సహకారంతో పాటు నీటి లోపలికి వెళ్లకుండా శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి సాంస్కృతిక వారసత్వాన్ని గ్రంథస్తం చేయడం, సంరక్షించడం, అధ్యయనం చేయడం పట్ల రెండు సంస్థలకూ ఉన్న ఉమ్మడి ఆసక్తిని కూడా ఈ కార్యక్రమం చాటిచెబుతుంది.




# పార్లమెంటరీ కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించనున్న యువత

న్యూఢిల్లీ, జూన్ 16:కేంద్ర యువజన వ్యవహారాలు – క్రీడలు – కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో.. యువజన వ్యవహారాలు – క్రీడల మంత్రిత్వ శాఖ 2026 జూన్ 15 నుంచి 17 వరకు న్యూఢిల్లీలో 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ? 2026'ను నిర్వహిస్తోంది. జాతీయ స్థాయి వికసిత భారత్ యూత్ పార్లమెంటును గౌరవ లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా 2026 జూన్ 16న ప్రారంభిస్తారు. విజయవంతమైన గత ఎడిషన్ల అనుభవంతో ఈ యేడూ ప్రతిష్ఠాత్మకంగా యూత్ పార్లమెంటును నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగస్వామ్యాన్ని పునస్సమీక్షిస్తూ.. పరిపాలన, విధాన చర్చలు, పార్లమెంటరీ వ్యవహారాలపై యువతకు ప్రత్యక్ష అవగాహనను ఈ కార్యక్రమం అందిస్తుంది.

'వికసిత భారత్ యూత్ పార్లమెంట్' కేవలం అధికారికంగా నిర్వహించే ఒక కార్యక్రమం మాత్రమే కాదు.. దేశ యువత శక్తినీ, ఆలోచనలనూ, ఆశయాలనూ జాతీయ స్థాయి చర్చల్లో భాగస్వామ్యం చేసే ఉద్యమమిది. సెంట్రల్‌హాల్‌లో వారు చేసే తీర్మానాలు.. ఈ మూడు రోజులకే పరిమితం కాదు. వికసిత భారత్ – 2047 దిశగా భారత్ ప్రస్థానాన్ని ముందుండి నడిపేలా ఈ తరం యువ నాయకులందరికీ స్ఫూర్తినిచ్చేలా ఇవి నిలుస్తాయి.

మూడు దశల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. యువత భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేలా ప్రతి దశనూ రూపొందించారు:

అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)కి 50 ఏళ్లపై విస్తృత స్థాయి చర్చలు: 757 నోడల్ విశ్వవిద్యాలయాలు/ విద్యాసంస్థల్లో దేశ ప్రజాస్వామ్య సంబంధిత పాఠ్యాంశాలను బోధించారు. తద్వారా ఈ చర్చ దేశంలోని నలుమూలలకూ చేరింది.

ప్రతి జిల్లా నుంచి మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనే అవకాశం లభించింది. అన్ని రాష్ట్రాల్లోని శాసనసభలు, ప్రముఖ ప్రభుత్వ వేదికల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. 'కేంద్ర బడ్జెట్ 2026: యువశక్తి ప్రాతిపదికగా బడ్జెట్'కు సంబంధించి ప్రాంతీయ పాలన విధానాలపై యువతకు అర్థవంతమైన అవగాహన కల్పించేలా ఈ దశ కార్యక్రమాలు దోహదపడ్డాయి.

రాష్ట్ర శాసనసభ స్పీకర్లు, గవర్నర్ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలు.. ప్రభుత్వ చర్చల్లో యువత భాగస్వామ్యం ప్రాధాన్యాన్ని పెంచాయి.

ప్రారంభోపన్యాసం: 'నారీ శక్తి వందన్: సమ్మిళితత్వానికి ఊతం, వికసిత భారత్ – 2047' అంశంపై ప్రతి జట్టు నుంచీ ఒక్కో ప్రతినిధి సభను ఉద్దేశించి 3 నిమిషాలు మాట్లాడుతారు.

ప్రశ్నోత్తరాల సమయం: యూత్ పార్లమెంటులో పాల్గొనే బృందాలన్నీ నిజమైన పార్లమెంటరీ స్ఫూర్తితో ప్రశ్నలు వేసి, వాటిపై ప్రతిస్పందిస్తాయి. ప్రశ్నకు 3 నిమిషాలు, సమాధానమివ్వడానికి 3 నిమిషాలు... ఈ విధంగా ఒక సామూహిక తీర్మానాన్ని వారు ఆమోదిస్తారు.

నిపుణులతో తరగతులు: వక్తృత్వం, ప్రజలనుద్దేశించి ప్రసంగించడంపై నిష్ణాతుడితో అభ్యర్థులకు తరగతులు నిర్వహిస్తారు. వారి నాయకత్వ నైపుణ్యాలకు ఇది మరింత పదును పెడుతుంది.

పీఎం సంగ్రహాలయ సందర్శన: పీఎం సంగ్రహాలయను ప్రత్యేకంగా సందర్శించడం ద్వారా.. సుసంపన్నమైన దేశ రాజకీయ వారసత్వాన్నీ, నాయకత్వ పరంపరనూ ప్రతినిధులు పరిశీలిస్తారు.

కొత్త పార్లమెంటు సందర్శన: దేశ నూతన పార్లమెంటు భవనంలో పర్యటన అభ్యర్థులకు కొత్త స్ఫూర్తినిస్తుంది. ఇది వారికి దేశ ప్రజాస్వామ్య మూలాలతో ప్రత్యక్షానుబంధాన్ని అనుభూతి చెందేలా చేస్తుంది.

పురస్కార ప్రదానోత్సవం: ఈ కార్యక్రమంలో భాగస్వాములైన యువ విశేష కృషికి గుర్తింపుగా.. జూన్ 17న 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్– 2026' పురస్కారాలను అందిస్తారు.

# ప్రజా సమస్యలపై సత్వర స్పందన..

–ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కారం
–అధికారులు సమన్వయంతో పనిచేయండి
–జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 201 అర్జీలు

విజయవాడ, జూన్ 16: ప్రజల సమస్యలపై సత్వరం స్పందించి వీలైనంత త్వరగా నాణ్యతతో పరిష్కరించడం జరుగుతోందని.. ఇదేవిధంగా ముందడుగు వేస్తూ ప్రతిఅధికారి అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి సోమవారం ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

మొత్తం 201 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూకు సంబంధించి 56, పురపాలక శాఖకు సంబంధించి 31, పోలీస్ శాఖకు 29, పంచాయతీరాజ్ శాఖకు 17, డీఆర్‌డీఏకు 10 అర్జీలు వచ్చాయి. విద్యుత్‌కు 9, వైద్య ఆరోగ్యానికి 7, ప్రజారవాణాకు 6, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్‌కు 5, కాలుష్య నియంత్రణకు 4, ఎండోమెంట్స్, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు మూడు



చొప్పున, పౌర సరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, విద్య, ఉపాధికల్పన, గృహ నిర్మాణం, కార్మిక, మైన్స్ అండ్ జియాలజీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి.

బీసీ సంక్షేమం, సహకార, డ్వామా, మత్స్య, జాతీయ రహదారులు విభాగాలకు ఒకటి చొప్పున వచ్చాయి. ఈ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సంతృప్తి స్థాయి బాగుండేలా అర్జీలను పరిష్కరించాలని.. ఈ విషయంలో జిల్లాస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజా వినతులపై స్పందన వేగవంతమైతేనే ప్రజలలో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

# దుర్గగుడికి దక్కనున్న టీటీడీ స్థలం..

–రూ.100 కోట్ల విలువైన స్థలం ఇచ్చేందుకు ధాత అంగీకారం..
–నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెర..
–దాత కుటుంబాన్ని ఒప్పించిన ఎంపీ కేసినేని శివనాథ్..
–టీటీడీ–దుర్గగుడి మధ్య స్థల బదిలాయింపుకు అవకాశం.
–భక్తుల వసతి సముదాయాల ఏర్పాటుకు మార్గం సుగమం
–కృష్ణా పుష్కరాల నాటికి మౌలిక సదుపాయాల ఏర్పాటు.

విజయవాడ, జూన్ 16: నాలుగు దశాబ్దాలుగా ఎటువంటి వినియోగానికి ఉపయోగించని కోట్ల రూపాయల విలువైన స్థలం దుర్గగుడి ఆస్తిగా మారనుంది. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీకి చెందిన అత్యంత విలువైన స్థలాన్ని దుర్గగుడి దేవస్థానానికి బదలాయించే ప్రక్రియకు మళ్లీ ఊపిరి లభించింది. భక్తుల వసతి, మౌలిక సదుపాయాల విస్తరణకు అత్యంత అనువైన స్థలాన్ని దుర్గగుడికి అందించేందుకు దాతలు ముందుకు వచ్చి అంగీకారం తెలిపారు.



విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని కుమ్మరిపాలెం సెంటర్‌లో ఉన్న స్థలాన్ని సుమారు 40 ఏళ్ల క్రితం నగరానికి చెందిన ప్రముఖ దాత సమా సాంబశివరావు తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. ఆ సమయంలో ఆ స్థలంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టాలనే ఆలోచనతో టీటీడీ ముందుకు వచ్చినప్పటికీ, పరిస్థితుల మార్పుతో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. అనంతరం రాష్ట్ర విభజన తర్వాత అమరావతి సమీపంలోని వెంకటపాలెంలో టీటీడీ ఆలయ నిర్మాణం చేపట్టడంతో కుమ్మరిపాలెం స్థలంపై ప్రణాళికలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇదే సమయంలో జాతీయ రహదారి, ఫ్లైఓవర్ నిర్మాణాల కారణంగా స్థలంలో కొంత భాగం కోల్పోయినా, మిగిలిన రెండు ఎకరాలకు పైగా భూమి ఇప్పటికీ అత్యంత విలువైన ఆస్తిగా కొనసాగుతోంది. అమ్మవారి ఆలయానికి అత్యంత సమీపంలో ఉండటం, భక్తుల అవసరాలకు అనువైన ప్రాంతంలో ఉండటంతో ఈ స్థలాన్ని దుర్గగుడికి కేటాయించాలని గత కొన్నేళ్లుగా పలు వర్గాల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. టీటీడీకి ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతంలో భూమి కేటాయించే ప్రతిపాదనలు కూడా చర్చకు వచ్చినప్పటికీ, దాతల అభ్యంతరాలతో విషయం ముందుకు సాగలేదు.

విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేసినేని శివనాథ్, దుర్గగుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ కలిసి దాత కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రానున్న కృష్ణా పుష్కరాల నాటికి భక్తుల కోసం ఆధునిక వసతి సదుపాయాలు, సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించి, ఈ స్థలాన్ని దేవస్థాన అవసరాలకు వినియోగించేందుకు అంగీకారం తెలపాలని కోరారు. సమావేశంలో దాత కుటుంబ సభ్యులు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. స్థలాన్ని దేవస్థానానికి వినియోగించే పక్షంలో అక్కడ నిర్మించే భవన సముదాయానికి దాత పేరు పెట్టాలని వారు సూచించినట్లు సమాచారం. దీనిపై ఎంపీ కేసినేని శివనాథ్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి అంశాన్ని తీసుకెళ్లి టీటీడీ అధికారులతో చర్చలు జరిపి తుది నిర్ణయానికి తీసుకువస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ప్రస్తుతం ఇంద్రకీలాద్రికి వచ్చే లక్షలాది మంది భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక వసతి సముదాయాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సుమారు రూ.100 కోట్ల విలువ చేసే ఈ భూమి దుర్గగుడికి దక్కితే బహుళ అంతస్తుల వసతి సముదాయాలు, టికెట్ బుకింగ్ కేంద్రాలు, సమాచార కేంద్రం, యాత్రికుల విశ్రాంతి మందిరాలు, పార్కింగ్ సదుపాయాలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేసే అవకాశం ఏర్పడనుంది. దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ఈ అంశం చివరకు సానుకూల మలుపు తిరుగుతుండటంతో భక్తులు, నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రపంచ సృజనాత్మక కేంద్రంగా భారత్‌ను నిలపాలనే పిలుపుతో ప్రారంభమైన 19వ ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం-2026

న్యూఢిల్లీ, జూన్ 16:డాక్యుమెంటరీ, కాల్పనిక కథల లఘు చిత్రాలు, యానిమేషన్ చిత్రాల కోసం భారత ప్రధాన ఉత్సవమైన ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఎమ్ఐఎఫ్ఎఫ్) 19వ ఎడిషన్... సినీ రంగంలోని శ్రేష్ఠత, సాంస్కృతిక వైవిధ్యం, సృజనాత్మక ఆవిష్కరణల ఘనమైన వేడుకల మధ్య సోమవారం సాయంత్రం ముంబయిలోని దాదర్‌లో గల రవీంద్ర నాట్య మందిరం వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది.

కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ ఉత్సవాన్ని ప్రారంభించి, వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి దిశా నిర్దేశం చేస్తూ కీలక ప్రసంగం చేశారు. కథలు వినూత్నంగా చెప్పడం, కంటెంట్ సృష్టించడం, సృజనాత్మక వాణిజ్యంతో భారత్ ప్రపంచస్థాయిలో అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక కేంద్రంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

సభనుద్దేశించి మాట్లాడుతూ... గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత మీడియా, వినోద రంగం సాధించిన అభివృద్ధి గురించి డాక్టర్ మురుగన్ ప్రధానంగా ప్రస్తావించారు. "నేడు భారత్ ప్రపంచస్థాయిలో సృజనాత్మకతకు కేంద్రంగా, కంటెంట్ సృష్టిలో విశ్వసనీయ భాగస్వామిగా గుర్తింపు పొందింది. మన కథలు ఖండాల వ్యాప్తంగా ప్రేక్షకులను ఉత్తేజపరిచే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మన సృజనాత్మక ప్రతిభావంతుల సమూహం... విస్తృతమైన దాని స్థాయి, సామర్థ్యంతో సాటిలేనిదిగా ఉంది" అని ఆయన అన్నారు.

"వేగవంతమైన డిజిటల్ పరివర్తన, నానాటికీ విస్తరిస్తున్న కంటెంట్ వినియోగం కారణంగా భారత మీడియా, వినోద పరిశ్రమ 2025 నాటికి 9 శాతం వృద్ధితో రూ. 2.78 లక్షల కోట్ల మైలురాయిని చేరుకుంది. డిజిటల్ మీడియా ఈ పరిశ్రమలో అతి పెద్ద విభాగంగా అవతరించి, తొలిసారిగా రూ.1 లక్ష కోట్ల ఆదాయపు మైలురాయిని దాటింది" అని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ రంగం 2028 నాటికి 7 శాతానికి పైగా సీఏజీఆర్ వృద్ధితో రూ. 3.3 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2025లోనే దేశంలో 1,900కు పైగా చిత్రాలు విడుదలయ్యాయనీ, ఇవి థియేట్రికల్ ఆదాయాల్లో 16 శాతం పెరుగుదలకు దోహదపడ్డాయని ఆయన పేర్కొన్నారు.

ముంబయిని భారత సృజనాత్మక రాజధానిగా అభివర్ణిస్తూ... 2025లో ఈ నగరంలో నిర్వహించిన వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) సాధించిన ఘన విజయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ప్రపంచంలోనే అగ్రగామి సృష్టికర్తల కేంద్రంగా మారాలన్న భారత్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఎమ్ఐఎఫ్ఎఫ్ వంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ మురుగన్ అన్నారు.

డాక్యుమెంటరీ చిత్రాల రూపకర్తలను నిర్మాతలు, పంపిణీదారులు, పరిశ్రమ నిపుణులు, ప్రపంచవ్యాప్త ప్రేక్షకులతో అనుసంధానించే ఒక ప్రధాన వేదికగా మరింత మెరుగవుతున్న వేవ్స్ డాక్ బజార్ ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ... ఈ కార్యక్రమం వర్ధమాన ప్రతిభకు, నిష్ణాతులైన నిపుణులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో సహాయపడుతోందనీ, ప్రభావవంతమైన డాక్యుమెంటరీల సృష్టికి, వాటి అంతర్జాతీయ పంపిణీకి ఇది వీలు కల్పిస్తోందని డాక్టర్ మురుగన్ వ్యాఖ్యానించారు.

సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) సహా ఈ ఉత్సవంతో సంబంధం ఉన్న ఇతర భాగస్వాములందరినీ కేంద్ర మంత్రి అభినందించారు. ఆవిష్కరణ, సృజనాత్మకత, సహకారం ద్వారా మీడియా, వినోద రంగాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఎమ్ఐఎఫ్ఎఫ్-2026 గణనీయ తోడ్పాటు నందిస్తుందని డాక్టర్ మురుగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగించిన మహారాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీ ఆశిష్ షెలార్... ప్రపంచవ్యాప్త ప్రతినిధులందరినీ ముంబయికి స్వాగతించారు. సృజనాత్మక పరిశ్రమలకు మద్దతునివ్వడానికి రాష్ట్రం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ముంబయిలో మొట్టమొదటి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీని ఏర్పాటు చేసినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన శ్రీ ఆశిష్ షెలార్... కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగరంలో ఒక మీడియా హబ్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద ప్రణాళిక ఉందని తెలిపారు. 2025లో ముంబయి వేదికగా వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ నిర్వహించడం పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి శ్రీ షెలార్ ధన్యవాదాలు తెలిపారు.

అంతకుముందు, సభికులకు స్వాగతం పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్... ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకోవడం, సృజనాత్మక వ్యక్తీకరణల పట్ల భారత శాశ్వత నాగరికతా విశ్వాసాన్ని ప్రతిబింబించే వేడుకగా ఎంఐఎఫ్ఎఫ్‌ను అభివర్ణించారు. రుగ్వేదంలోని ప్రసిద్ధిగాంచిన "మంచి ఆలోచనలు అన్ని వైపుల నుంచి మనకు అందాలి" అనే సూక్తిని ఉటంకిస్తూ... ఈ ఉత్సవం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చిత్రాలను, ఆలోచనలను, సృష్టికర్తలను ఒకచోట చేర్చుతోందని అన్నారు. వాస్తవాలను లోతుగా అన్వేషించి, వాటిని ఆకట్టుకునే సినిమా కథనాల ద్వారా ప్రదర్శించడానికి సాహసించే చిత్రరూపకర్తలకు ఒక కీలక వేదికను అందించడం ద్వారా ఈ ఎంఐఎఫ్ఎఫ్... గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'క్రియేట్ ఇన్ ఇండియా' దార్శనికతనూ ప్రతిబింబిస్తోందని కార్యదర్శి అన్నారు.

భారతీయ సినిమాకు చేసిన విశేష సేవలకు గానూ ప్రఖ్యాత నటుడు జైదీప్ అహ్లావత్‌ను సత్కరించడం ఈ సాయంత్రం జరిగిన ముఖ్య కార్యక్రమాల్లో ఒకటి. ఇతర ప్రముఖుల సమక్షంలో డాక్టర్ ఎల్. మురుగన్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సత్కారాన్ని అందుకున్న అహ్లావత్ మాట్లాడుతూ... అర్థవంతమైన కథనాల కోసం ప్రపంచస్థాయి వేదికను కల్పించడంలోనూ, ప్రధాన స్రవంతి కథనాలకు అతీతంగా సినీ గళాన్ని ప్రోత్సహించడంలోనూ ఎంఐఎఫ్ఎఫ్ వంటి ఉత్సవాల ప్రాముఖ్యతను అంగీకరిస్తూ, ఈ కార్యక్రమ నిర్వహణ కోసం తన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ వేడుకలో, ఉత్సవ ప్రారంభ చిత్రాల వెనక ఉన్న సృజనాత్మక బృందాలనూ ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన 'అగాపిటో' లఘుచిత్రం, 'టైమ్ అండ్ వాటర్' డాక్యుమెంటరీ రూపకర్తలను ఈ వేదికపై సన్మానించారు.

'అగాపిటో' చిత్ర నటుడు ఆంటోన్ నోలాస్కో, కాస్టింగ్ డైరెక్టర్ క్రిస్టినా సైమన్‌లను సత్కరించారు. ప్రపంచంలోని ఆసక్తికరమైన కథలను ప్రేక్షకులకు అందించినందుకు 'టైమ్ అండ్ వాటర్'తో అనుబంధం ఉన్న నేషనల్ జియోగ్రఫిక్, జియోస్టార్ బృందాల సభ్యులనూ ఘనంగా సత్కరించారు.

ప్రారంభోత్సవంలోని మరో విభాగంలో... అంతర్జాతీయ పోటీ జ్యూరీ, జాతీయ పోటీ జ్యూరీ, ఎఫ్ఐపీఆర్‌ఈఎస్‌సీఐ జ్యూరీల సభ్యులకు ఉత్సవ నిర్వాహకులు సాదర స్వాగతం పలికి, సత్కరించారు.

ఈ ఉత్సవంలోని విభిన్నమైన డాక్యుమెంటరీలు, కల్పనాత్మక కథల లఘు చిత్రాలు, యానిమేషన్ చిత్రాలను పరిశీలించి, వాటి నుంచి అత్యుత్తమైన వాటిని ఎంపిక చేసే బాధ్యతను... భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పేరుగాంచిన చిత్రరూపకర్తలు, విమర్శకులు, పండితులు, ప్రోగ్రామర్లు, మీడియా నిపుణులతో కూడిన జ్యూరీ ప్యానెల్‌లకు అప్పగించారు.

ప్రారంభోత్సవ వేడుకలో భారత కళా వారసత్వాన్ని ప్రదర్శించే ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ చిత్రనిర్మాత-ఐఎఫ్‌ఎఫ్ఐ 2026 ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీ అశుతోష్ గోవారికర్, ప్రసార భారతి ఛైర్మన్ శ్రీ ప్రసూన్ జోషి, ఎన్ఎఫ్‌డీసీ ఛైర్మన్ శ్రీ కృష్ణకుమార్ జి, ఎమ్ఐఎఫ్ఎఫ్ ఫెస్టివల్ డైరెక్టర్-ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాష్ మగ్దుమ్, ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐడీపీఏ) అధ్యక్షులు శ్రీ సంస్కార్ దేశాయ్, సినీ పరిశ్రమ ప్రముఖులు, చిత్ర నిర్మాతలు, జ్యూరీ సభ్యులు, దేశవిదేశాలకు చెందిన విశిష్ట అతిథులు హాజరయ్యారు.


సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే... ఎన్ఎఫ్‌డీసీ అమలు చేసే ఈ ఏడు రోజుల ఉత్సవం... చిత్రరూపకర్తలు, పరిశ్రమ నిపుణులు, సినీ ప్రియులందరికీ ఒక సుసంపన్నమైన అనుభవాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ప్రాంతీయ సినిమా గొప్పతనాన్ని ప్రదర్శించడం, భారత సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటిచెప్పడం లక్ష్యంగా... ఈ సంవత్సరం ఉత్సవంలో "మరాఠీ చిత్రాలు", "ఎకోస్ ఫ్రమ్ నార్త్-ఈస్ట్" అనే రెండు కొత్త విభాగాలనూ ప్రవేశపెట్టారు.

ఎమ్ఐఎఫ్ఎఫ్ వేదికగా ఒకచోట చేరుతున్న భారత-ప్రపంచవ్యాప్త అసాధారణ చిత్రాలు, విభిన్న ప్రాంతాల గళాలు, దృక్కోణాల ప్యాకేజీ గురించిన మరిన్ని వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి.

ప్రత్యేకించి నాన్-ఫీచర్ సినిమాల కోసం దక్షిణాసియాలోనే అతి పురాతన, అతిపెద్ద చలనచిత్రోత్సవంగా గుర్తింపు పొందిన ముంబయి అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఎమ్ఐఎఫ్ఎఫ్)... డాక్యుమెంటరీ, కాల్పనిక కథల లఘు చిత్రాలు, యానిమేషన్ చిత్రాల నిర్మాణానికి ఎప్పటినుంచో ఒక ఉత్సాహభరితమైన వేడుకగా నిలుస్తోంది. 1990లో స్థాపించి, భారత ప్రభుత్వ సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎమ్ఐఎఫ్ఎఫ్... ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్రరూపకర్తలు, కళాకారులు, సినీ ప్రియులను ఆకర్షించే ఒక ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికగా ఎదిగింది.

ఎమ్ఐఎఫ్ఎఫ్ 19వ ఎడిషన్... పరిశ్రమపై ప్రధానంగా దృష్టి సారించిన ఉత్తేజకరమైన కార్యక్రమాలతో పాటు, ఆలోచనాత్మకంగా ఎంపిక చేసిన, ప్రశంసలు పొందిన అంతర్జాతీయ చిత్రాల శ్రేణితో మైమరపించే, సుసంపన్నమైన సినిమా అనుభవాన్ని అందిస్తుందని వాగ్దానం చేస్తోంది. ఎమ్ఐఎఫ్ఎఫ్-2026లో పాల్గొనడం ద్వారా కథలను వైవిధ్యంతో చెప్పే ఉత్సాహభరితమైన ప్రపంచంలోకి అడుగు పెట్టండి. ఇక్కడ శక్తిమంతమైన సినిమా, సృజనాత్మక మేధస్సు, స్ఫూర్తిదాయకమైన అనుభవాలు కలిసి డాక్యుమెంటరీ, యానిమేషన్, కాల్పనిక కథల లఘు చిత్రాలతో మరపురాని వేడుకను సృష్టిస్తాయి.

# మిర్యాలగూడలో బైక్ దొంగలు ముగ్గురు అరెస్ట్




హైదరాబాద్, జూన్ 16:మిర్యాలగూడ పట్టణంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలు చోరికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సోమనర్సయ్య తెలిపారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణ పోలీసులు హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి డాక్యుమెంట్లు చూపించాలని అడగగా వారు ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు మద్యం సేవించడం, గుట్కా విని యోగించడం, పేకాట ఆడడం వంటి చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో పట్టణం లోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిళ్లను చోరి చేసినట్లు ఒప్పుకున్నారు.

నిందితులను నల్లగొండ పట్టణ అర్జాలబావికి చెందిన కొంగరి నవీన్‌కుమార్, పాలకీడు మండలం గుడుగుంట్లపాలెంకు చెందిన సోమిరెడ్డి సైదిరెడ్డి, దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన కె.సుమలతగా గుర్తించారు. పాత ద్విచక్ర వాహనాలను దొంగలించి దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న సుమలత పాత ఇనుప సామాను దుకాణంలో విక్రయించినట్లు తెలిపారు. ఆమె మోటార్ సైకిళ్లను రూ.2,500 నుండి రూ.3 వేలకు తక్కువ ధరకు కొనుగోలు చేసి విడి భాగాలుగా విభజించి విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. చోరీ వాహనాల స్పేర్ పార్ట్స్ విక్రయించగా వచ్చిన రూ.1.38 లక్షల నగదును సుమలత నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా నిందితుల నుండి రెండు మోటార్ సైకిళ్లు, రూ. 1.38 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నట్లు వివరించారు.

## ఉత్తర రైల్వేలోని అంబాలా విభాగానికి రూ.201 కోట్ల కవచ్ ప్రాజెక్టును ఆమోదించిన భారత రైల్వే

న్యూఢిల్లీ, జూన్ 16:రైల్వే భద్రతను బలోపేతం చేస్తూ, ఉత్తర రైల్వేలోని అంబాలా విభాగంలో మిగిలిన బ్రాడ్‌గేజ్ మార్గాల్లో కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు భారత రైల్వే ఆమోదం తెలిపింది. 811 కి.మీ మేర విస్తరించిన ఈ ప్రాజెక్టును రూ.201 కోట్ల వ్యయంతో మంజూరు చేశారు. భారత రైల్వేలోని మిగిలిన మార్గాల్లో ఎల్‌ఈటీ ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థతో కవచ్‌ను ఏర్పాటు చేసే సమగ్ర కార్యక్రమం ద్వారా ఈ పనులకు ఆమోదం లభించింది.

మంజూరైన ఈ పనులు అంబాలా డివిజన్‌లోని అంబాలా కంటోన్మెంట్-లుధియానా, కాల్కా-చండీగఢ్-న్యూ మోరిండా-సాహ్నేవాల్, సిర్హింద్-దౌలత్‌పూర్ చౌక్, రాజ్‌పురా-భటిండా-శ్రీ గంగానగర్, లుధియానా-ధురి-జఖాల్ విభాగాలతో ముఖ్యమైన రైలు మార్గాల్లో జరుగుతాయి.

ఈ మార్గాలు హర్యానా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌ను కలిపే కీలకమైన రైలు కారిడార్లుగా పనిచేస్తాయి. ఇవి భారీ మొత్తంలో ప్రయాణికులను, సరకు రవాణాను చేరవేస్తూ.. ఈ ప్రాంతంలో ప్రజల రాకపోకలకు, వస్తువుల రవాణాలో కీలక పాత్ర పోషిస్తాయి.

రైలు ప్రయాణ భద్రతను మెరుగుపరిచేందుకు మన దేశంలోనే సొంతంగా అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ రైలు రక్షణ (ఏటీపీ) వ్యవస్థే కవచ్. ప్రమాదకర పరిస్థితుల్లో రైలు సిగ్నల్ దాటటాన్ని (ఎస్‌పీఏడీ) నివారించేందుకు ఇది సహాయపడుతుంది. ప్రమాదకర పరిస్థితులను తప్పించేందుకు ఆటోమేటిక్‌గా బ్రేకులు వేస్తుంది. క్లిష్ట పరిస్థితుల్లో రైలు వేగాన్ని నియంత్రించి, ఢీకొనే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

అధిక రద్దీ, వ్యూహాత్మకంగా ముఖ్యమైన మార్గాల్లో భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు భారత రైల్వే చేపడుతున్న నిరంతర ప్రయత్నాల్లో భాగంగా.. వ్యవస్థ అంతటా కవచ్ విస్తరణ జరుగుతోంది.

## డిమాండ్ నోటీసుల పంపిణీపై నల్లగొండ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

నల్గొండ, జూన్ 16: మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయ వృద్ధి, పన్నుల వసూళ్ల లక్ష్యాల సాధనలో భాగంగా నల్లగొండ నగరంలోని 38, 39వ డివిజన్లలో చేపడుతున్న డిమాండ్ నోటీసుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర మంగళవారం ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి డిమాండ్ నోటీసుల పంపిణీ తీరును పరిశీలించిన కమిషనర్, ప్రతి ఆస్తి యజమానికి డిమాండ్ నోటీసు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పన్ను చెల్లింపుదారులకు ఆస్తి పన్నులు, ఇతర మున్సిపల్ బకాయిల చెల్లింపుపై అవగాహన కల్పిస్తూ సకాలంలో పన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలని సూచించారు. డిమాండ్ నోటీసుల పంపిణీ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని, రోజువారీ ప్రగతిని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని కమిషనర్ తెలిపారు.

పన్నుల వసూళ్ల పెంపునకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని, బకాయిల వసూళ్లపై మరింత దృష్టి సారించాలని సూచించారు. ప్రతి వార్డు స్థాయిలో వసూళ్ల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని ఆదేశించారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకం చెక్కులు పంపిణీ

నల్గొండ, జూన్ 16: భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం చెక్కులను పంపిణీ చేశారు. పోషించే పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబాలను ఆదుకునే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, గ్రామ సర్పంచ్ దుమాల మమత (రాజు) చేతుల మీదుగా చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా చేంగల్ గ్రామానికి చెందిన నలుగురు మహిళలకు రూ.20 వేల చొప్పున మంజూరు అయినట్లు తెలిపారు.

18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కుటుంబ యజమాని మరణించిన మహిళలు ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకం పెద్ద చేయూత ఇస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్, గ్రామ శాఖ అధ్యక్షుడు దుమాల రాజు, పల్లికొండ సర్పంచ్ పిండి మనూష (అశోక్), ఎంపీడీవో కంప్యూటర్ టైపిస్ట్ చంద్రశేఖర్, ఆపరేటర్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నివాసంలో తనిఖీలు

## -నగదు, బంగారం, కీలక పత్రాలపై అధికారుల దృష్టి

నల్గొండ, జూన్ 16: ల్యాండ్స్ అండ్ సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఛత్రినాకలో ఉన్న ఆయన నివాసంతో పాటు కార్యాలయం, బంధువుల ఇళ్లు సహా మొత్తం 11 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు కొనసాగుతున్నాయి.

ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు తెల్లవారుజాము నుంచే సోదాలు ప్రారంభించాయి. ఈ సందర్భంగా నగదు, బంగారు ఆభరణాలు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు.

సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. నరహరి పేరుతో పాటు కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను కూడా ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు. సోదాలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న నగదు, ఆస్తులు, పత్రాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

# విజయవాడలో ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ తొలి బోర్డు సమావేశం: నంది అవార్డులపై కీలక చర్చ!



అమరావతి, జూన్ 16:ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ నూతన పాలకమండలి తొలి సమావేశం విజయవాడలో ఘనంగా జరిగినట్లు తెలుస్తుంది. ఈ సమావేశానికి కార్పొరేషన్ ఛైర్మన్ పి. భరత్ భూషణ్ అధ్యక్షత వహించగా, మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ పాల్గొని వివరాలను వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక సమావేశంలో బోర్డు డైరెక్టర్లుగా ఉన్న ప్రముఖ నటుడు సుమన్ తల్వార్, ఎస్. శివాజీ, బుర్రా సాయిమాధవ్, చదలవాడ శ్రీనివాసరావు, వివేక్ కూచిభొట్ల, వి. సముద్ర, వై. రఘూనీ, కందిమల్ల సాంబశివరావు, కె. ఉమామహేశ్వరరావు, ఎస్. వెంకట కృష్ణారెడ్డి, జి. రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణ, మరియు దుర్గాప్రసాద్ సాహు తదితరులు హాజరయ్యారు.

రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక రంగాల సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో సభ్యులు విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా చిక్కాల మెహర్ రమేష్ కుమార్‌ను నియమించే ప్రక్రియను బోర్డు పూర్తి చేసింది. అనంతరం జరిగిన జనరల్ మీటింగ్ (ఇఉఓ) లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వ ఆమోదం కోసం పంపేలా ఖరారు చేశారు. ఆంధ్రప్రదేశ్ వినోద రంగాన్ని బలోపేతం చేయడం కోసం మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ప్రోత్సాహం, సినిమా షూటింగ్‌లకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం మరియు పరిశ్రమ వృద్ధికి ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడం వంటి కీలక అంశాలపై బోర్డు సుదీర్ఘంగా చర్చించింది.

తెలుగు సినీ రంగానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'నంది అవార్డుల' అంశంపై ఈ సమావేశంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. గతంలో ప్రకటించిన అవార్డులతో పాటు, భవిష్యత్తులో నిర్వహించబోయే నంది అవార్డుల వేడుకల యొక్క రూపకల్పన, విధానాలు మరియు సిఫార్సులకు సంబంధించిన పలు అంశాలను సభ్యులు సమీక్షించారు. ఏపీలో చిత్ర పరిశ్రమను మరింత బలోపేతం చేస్తూ, కళాకారులకు, సాంకేతిక నిపుణులకు మరియు నిర్మాతలకు కార్పొరేషన్ ద్వారా పూర్తి మద్దతు అందిస్తామని బోర్డు సభ్యులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముదావత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు కార్పొరేషన్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చింతపల్లి సాయిబాబాను దర్శించుకున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, జూన్ 16:నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా 19వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ కుమార్ బాబాని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచిగంటి ధనంజయ, కమిటీ సభ్యులు, అర్చకులు ఆయనకు ఆహ్వానం పలికి వేద ఆశీర్వచనం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకటరెడ్డి, అండెకార్ అశోక్, కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరే కృష్ణయ్య, కుంభ పుల్లారెడ్డి, తడకమల్ల శ్రీను, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు

ఆహ్వానం


శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో
శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు



" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్ |
| సభాధ్యక్షులు | : | శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త |
| విశిష్ట అతిథి | : | శ్రీ కళా జనార్ధన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం |
| పురస్కార గ్రహీత | : | శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజీషియన్ |
| ప్రత్యేక ఆహ్వానితులు | : | శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్ |
| ఆత్మీయ అతిథి | : | శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి, మేనేజర్ సాహితీ కిరణం |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్ |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని |

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.



# గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే

## - కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
## - మానకొండూరులో ఆర్ఎంపీ, పీఎంపీలతో 'చాయ్ పే చర్చ'

కరీంనగర్, జూన్ 16: (నేటి నిజం ప్రతినిధి) గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ఆర్ఎంపీ, పీఎంపీలే ప్రధాన భరోసా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించలేమని, వారిపై దాడులు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. గ్రామీణ వైద్యులు సేవలు నిలిపివేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనకు 12 ఏళ్లు పూర్తైన సందర్భంగా మానకొండూరులో నిర్వహించిన 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వ విజయాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. సమాజంలో చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు చేరేలా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎంపీ, పీఎంపీలు తమకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పేరుతో తమపై అకారణంగా దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మానకొండూరు నియోజకవర్గ ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సంఘానికి సొంత భవనం నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన బండి సంజయ్, ఆర్ఎంపీలు గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సభ్యుల్లా సేవలందిస్తున్నారని కొనియాడారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వారిపై వేధింపులు సరికాదన్నారు. ఆర్ఎంపీలు పది రోజులు సేవలు నిలిపివేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలో దేశంలో డిజిటల్ విప్లవం సాధ్యమైందని బండి సంజయ్ పేర్కొన్నారు. జన్‌ధన్ ఖాతాలు, డిజిటల్ చెల్లింపుల ద్వారా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు తీసుకొచ్చామని, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సంక్షేమ భవన నిర్మాణానికి స్థలం చూపిస్తే ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు బండి సంజయ్ హామీ ఇచ్చారు



# బుధవారం రామగుండం మున్సిపల్ ఆఫీసు ఎదుట నిరాహార దీక్ష.. సీఐటీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి

కరీంనగర్, జూన్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళ వారం మున్సిపల్ కార్మికుల అడ్డాపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర యేళ్లు గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన విధంగానే మున్సి పల్ కార్మికులు సైతం మోసపోయారని అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల నీ, రెండో పీఆర్సీలో కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి కేటగిరి లుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యంను ఎండగడుతూ ఈనెల 18, 19 తేదీల్లో అన్ని మున్సిపల్ కార్యాల యాల ఎదుట నిరాహార దీక్షలు చేపడు తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సీసీఐ పునఃప్రారంభంపై ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలి: మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్, జూన్ 16:ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ సిమెంట్ పరిశ్రమ పునఃప్రారంభం కోసం సీసీఐ సాధన కమిటీ అనేక సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ పునఃప్రారంభ విషయంలో చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో 'హలో యువత చలో సీసీఐ పరిశ్రమ'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం సీసీఐ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

పరిశ్రమలో స్క్రాప్‌గా మార్చిన ప్రాంతాలను జోగు రామన్న, సీసీఐ సాధన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్లముందే యువత ఆశలు చెదిరిపోతుంటే అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వలాభాల కోసం పరిశ్రమను తుక్కుగా మారుస్తున్నాయని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా పరిశ్రమలు లేని వెనుక బడిన జిల్లాగా ఉందని, సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభమైతే వేలాది మంది యువతీ యువకులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర నాయకులు బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

స్క్రాప్ టెండర్ల వ్యవహారంపై తాము ప్రశ్నించినప్పటికీ ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోం దన్నారు. భూ నిర్వాసితులు తమ భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతుండగా, వందేళ్లకు సరిపడా ముడి సరుకు ఉన్నప్పటికీ పరిశ్రమ పునఃప్రారంభానికి ఒత్తిడి తేవడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ ప్రజలు దీనిపై గట్టి తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దర్శనాల మల్లేష్ సీసీఐ సాధన కమిటీ కన్వీనర్, విజ్జగిరి నారాయణ కో - కన్వీనర్, కొండ రమేష్, బొల్లు ఈశ్వర్, నంది రామయ్య, గోడం గణేష్, వెంకట నారాయణ, అరుణ్ కుమార్, మునిగెల నర్సింగ్, లంక రాఘవులు, లోకారి పోశెట్టి, బండి దత్తాత్రి,1 జగన్ సింగ్ భూ నిర్వాసితులు కస్తాల అరుణ్, కస్తాల ప్రేమల, ఉగ్గే విట్టల్, నాయకులు పట్టణ అధ్యక్షులు అజయ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్,దాసరి రమేష్, వెనగంటి ప్రకాష్,కొండ గణేష్ దమ్మపాల్, అన్నల వసంత్, పండ్ల శ్రీను, బట్టు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# 'ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ టూరిజం రంగాల్లో అపార అవకాశాలు'

## -ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్గొండ, జూన్ 16:ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ టూరిజం రంగాల్లో యువతకు అపార అవకాశాలు ఉన్నట్లు నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. ఎంజీయూ వంటి ఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రంలో తమ విద్యార్థులకు అవకాశం లభించడం విశేషమని విభాగాధిపతి డా.జక్కా సురేశ్ రెడ్డి తెలిపారు. ఈ అనుభవం తిక, ఆధ్యాత్మిక, ఎకో టూరిజంతో పాటు ఫిల్మ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, టూరిజం రంగాల్లో యువతకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. టూరిజం



మేనేజ్‌మెంట్ కళాశాల ఎం.బి.ఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ ) విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థులు రామోజీ ఫిల్మ్ సిటీలో 52 రోజుల ఇంటర్న్‌షిప్‌ని విజయవంతంగా పూర్తి చేశారు.

ఈ ఇంటర్న్‌షిప్‌లో వారు టూరిజం విభాగంలోని గెస్ట్ రిలేషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజ్‌మెంట్, మెర్చండైజింగ్ ఆపరేషన్స్ తదితర విభాగాల్లో శిక్షణ పొందారు. రామోజీ ఫిల్మ్ సిటీ ద్వారా విద్యార్థులు పర్యాటకుల ఆతిథ్య సత్కారం, ఈవెంట్ అండ్ థీమ్ పార్క్ నిర్వహణ, సేల్స్ అండ్ మెర్చండైజింగ్ అంశాలపై తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకున్నట్లు తెలిపారు.

ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులను వర్సిటీ వీసీ అభినందించారు.

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక-సాంస్కృతిక అభివృద్ధిలో టూరిజం రంగ ప్రాముఖ్యతను వివరించారు. చారిత్రక, సాంస్కృ రంగంపై పెరుగుతున్న ఆసక్తి నేపథ్యంలో ఎంబీఏ టీటీఎం వంటి కోర్సులు విద్యార్థులకు టూర్ ఆపరేషన్స్, ట్రావెల్ ఏజెన్సీ లు, ఈవెంట్ మేనేజ్ మెంట్, హోటల్స్, రిసార్ట్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌లైన్, ఎయిర్‌పోర్ట్ సేవలు, థీమ్ పార్క్, ఫిల్మ్ టూరిజం వంటి విభిన్న రంగాల్లో విస్తృత మైన ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని కళాశాల ప్రతినిధులు తెలిపారు.

# హైస్కూల్‌లో ఇంగ్లీష్ టీచర్ వింత ప్రవర్తన..

జనగామ,జూన్ 16: ప్రభుత్వ పాఠశాలలో టీచర్ వింతగా ప్రవర్తించడం చర్చనీయాంశంగా మారింది. టీచర్ ప్రవర్తనతో విసిగిపోయిన విద్యార్థులు ఈ టీచర్ మాకొద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. జనగామ జిల్లా చిల్పూర్ మండలంలోని ఓ హైస్కూల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సదరు హైస్కూల్‌లో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ విద్యార్థుల పట్ల వింతగా ప్రవర్తిస్తోంది. జనగణన సమయంలో ఇంగ్లీష్ టీచర్ విద్యార్థినిని అనవసరపు ప్రశ్నలు వేసింది.

ఈ విషయంపై సర్పంచ్ రాజు సదరు ఇంగ్లీష్ టీచర్‌ను ప్రశ్నించగా.. పుస్తకాలు విసరడం, వెకిలిగా నవ్వడం, హెచ్ఎం కుర్చీలో కూర్చోవడం, పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించింది. ఆమె ఇలా వింతగా ప్రవర్తించడానికి గల కారణాలు తెలియాల్సి ఉండగా.. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

# భారత ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థకు బహుభాషా సౌకర్యం

న్యూఢిల్లీ, జూన్ 16:ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై), డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ) పరిధిలోని డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐబీఐ).. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ ప్రభుత్వ కొనుగోళ్ల పోర్టల్ గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్ (జీఇఎం) అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. జాతీయ భాషా డిజిటల్ మౌలిక సదుపాయమైన భాషిణి వేదిక ద్వారా దేశంలోని ప్రభుత్వ కొనుగోళ్ల వ్యవస్థలో బహుభాషా డిజిటల్ సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు "భాషిణి ఫర్ సేవ, సంచాలన్ - ఏ భాషిణి సహయోగి ప్రోగ్రామ్" ద్వారా ఈ ఒప్పందం జరిగింది.

జీఇఎం డిజిటల్ వేదికల్లో వివిధ భాషల్లో సౌలభ్యాన్ని, పాలనను, సేవలను అందించడాన్ని ప్రోత్సహించటమే ఈ భాగస్వామ్యం ఉద్దేశం. దీనిద్వారా భాగస్వాములకు నచ్చిన భాషలో సమాచారాన్ని, సేవలను పొందే వీలుంటుంది. ఈ ఒప్పందం ద్వారా వాయిస్ ఆధారిత భాషా సాంకేతిక మౌలిక సదుపాయాలను, జనరేటివ్ ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయటమే కాక, అధికారిక గుర్తింపు కలిగిన 22 భారతీయ భాషలతో పాటు ఇతర భారతీయ భాషల్లోనూ సులభంగా సంభాషించేందుకు వీలవుతుంది. ఈ సహకార ఒప్పందం ద్వారా జీఇఎం, భాషిణి బృందం కలిసి భాషిణి ఉద్యత్, మిత్ర, యాప్ మిత్ర, సహయోగి, ప్రవక్త వంటి కార్యక్రమాల సహాయంతో బహుభాషా డిజిటల్ ప్రజా వనరుల రూపకల్పన, సమగ్రత, అమలు దిశగా కృషి చేస్తాయి. జీఇఎం వ్యవస్థలో బహుభాషా సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు అనువాద ఏపీఐ సమగ్రత, నిర్దిష్ట రంగానికి సంబంధించిన భాషా నమూనాల అభివృద్ధి, బహుభాషా పదకోశాల తయారీ, వాయిస్-ఆధారిత సాంకేతికతలు, రిఫరెన్స్ అప్లికేషన్లు, వాయిస్ బాట్లు, భాషా సంబంధిత డేటాసెట్ల అభివృద్ధి వంటి అంశాలకు ఈ సహకారం మద్దతిస్తుంది. భాషా పరమైన అడ్డంకులను తొలగించటం ద్వారా సేకరణ సేవలు, విక్రేత ఆన్‌బోర్డింగ్, ప్లాట్‌ఫారమ్ నావిగేషన్, కమ్యూనికేషన్, వాటాదారుల భాగస్వామ్యంలో- అందరికీ అందుబాటులో ఉండేలా, సమానమైన భాషా సౌలభ్యాన్ని కల్పించటం ద్వారా మరింత సమ్మిళిత ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ అభివృద్ధికి ఈ కార్యక్రమం తోడ్పడుతుంది. జీఇఎం వేదిక లోని వాటాదారులు బహుభాషా డిజిటల్ వ్యవస్థలో సమర్థవంతంగా పని చేయటానికి, పరస్పరం చర్చించుకునేందుకు, పాల్గొనేందుకు వారిని శక్తిమంతం చేయాలని ఈ భాగస్వామ్యం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రభుత్వ కొనుగోళ్లు, ప్రభుత్వ సేవలు, వాణిజ్య వ్యాపార భాగస్వామ్య అవసరాలకు అనుగుణంగా రూపొందించిన బహుభాషా ఏఐ నమూనాలు, భాషా సాంకేతికతలను బలోపేతం చేయటంపై ఈ సహకారం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. తద్వారా భారతదేశంలోని విభిన్న భాషా ప్రాంతాల్లో వాయిస్ ఆధారిత బహుభాషా సేవలను పొందే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ సేకరణ అవకాశాలను విస్తృతం చేయటంలో, సులభతర వ్యాపారాలను (ఈఓడీబీ) ప్రోత్సహించటంలో బహుభాషా సాంకేతికతల ప్రాముఖ్యత పెరుగుతోందని ఈ చర్చలు స్పష్టం చేశాయి. ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థలు, వ్యవస్థాపకులు, వివిధ భాషా ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించే సంస్థలకు ఇవి మరింత ముఖ్యం. ప్రభుత్వ సేకరణ, ఆర్థిక అవకాశాల్లో భాగస్వామ్యానికి భాష అడ్డంకిగా ఉండకుండా చూడటమే ఈ ఒప్పంద ఉద్దేశం.

# సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సేవలపై సీపీఎం ఆగ్రహం




కరీంనగర్, జూన్ 16: సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ సేవలు పేద ప్రజలకు అందడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ ఆరోపించారు. స్థానిక కార్మిక భవన్‌లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పేదలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించేందుకు ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు. అత్యవసరంగా రక్తం అవసరమైన బాధితులు ఆసుపత్రికి వస్తే, మరో వ్యక్తి రక్తదానం చేస్తేనే రక్తం ఇస్తామని నిబంధనలు పెట్టడం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

అలాగే, ఆసుపత్రిలో తాజా రక్తం అందుబాటులో లేదంటూ రోగులు, వారి కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురిచేసి ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులను ఆశ్రయించాలని సూచిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో లభించాల్సిన సేవల కోసం ప్రజలు ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ వెంటనే విచారణ జరిపి, బ్లడ్ బ్యాంక్ సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీరాములు, రమేష్ చంద్ర, అలువాల లక్ష్మణ్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

# కెనడా, ఫిలిప్పీన్స్, ఐస్‌ల్యాండ్ దేశాలకు చెందిన మూడు అంతర్జాతీయ చిత్రాలతో ప్రారంభమైన 19వ ఎంఐఎఫ్ఎఫ్-2026

న్యూ ఢిల్లీ, జూన్ 16:కరుగుతున్న హిమనీ నదాలు, చెదురుతున్న జ్ఞాపకాల దగ్గర నుంచి మనుషుల్లోని కోరికలు, ఏఐ అనిశ్చితుల వరకు.. వివిధ ఇతివృత్తాలతో రూపొందించిన మూడు చిత్రాలు ముంబయిలో ఈ రోజు ప్రారంభమైన 19వ ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఎంఐఎఫ్ ఎఫ్)-2026కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆ చిత్రాలు.. 'టైమ్ అండ్ వాటర్', 'అగాపిటో', 'గుడ్ లక్ టు యూ ఆల్'. ప్రారంభ వేడుకల అనంతరం రవీంద్ర నాట్య మందిర్‌లో ఈ మూడు చిత్రాలను ప్రదర్శించారు. డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిక్షన్, యానిమేషన్ చిత్రాల కోసం భారతదేశంలో నిర్వహించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ ఎంఐఎఫ్ఎఫ్ చలనచిత్రోత్సవం 2026 జూన్ 15 నుంచి 21 వరకు ముంబయిలో జరుగుతుంది.

కాలం, మంచు, జ్ఞాపకాల అంతర్మథనం: టైమ్ అండ్ వాటర్

సారా డోసా దర్శకత్వం వహించిన టైమ్ అండ్ వాటర్ ప్రదర్శనతో ఉత్సవం ప్రారంభమైంది. ఈ డాక్యుమెంటరీని నిన్మాహ్ ఫౌండేషన్ సహకారంతో నేషనల్ జాగ్రఫిక్ డాక్యుమెంటరీ ఫిలిమ్స్, శాండ్ బాక్స్ ఫిలిమ్స్ సమర్పించాయి. ఇది ఐస్‌ల్యాండ్ రచయిత ఆండ్రీ స్నైయర్ మాగ్నాసన్ తన వ్యక్తిగత, చారిత్రక జ్ఞాపకాలను ఒక టైమ్ కాప్స్యూల్‌గా ఎలా మార్చారో చూపిస్తుంది. కరిగిపోతున్న హిమానీనదాలు, మారిపోతున్న ప్రకృతి దృశ్యాల నేపథ్యంలో సాగే ఆయన ప్రయాణం.. పర్యావరణపరంగా, కుటుంబపరంగా ఎదురైన నష్టాలను హృద్యంగా ప్రదర్శిస్తుంది. కరుగుతున్న మంచును, చెదురుతున్న జ్ఞాపకాలతో ముడిపెడుతుంది. మానవ-ప్రకృతి సంబంధాలను అన్వేషించే చిత్రాలు తీయడంలో పేరుగాంచిన నాన్-ఫిక్షన్ ఫిలిం మేకర్ సారా డోసా ఆస్కార్‌కు నామినేట్ అయ్యారు. ఈ సినిమా కాలం, మార్పు, తరాల మధ్య ఉండాల్సిన బాధ్యతపై కవితాత్మక ఆలోచనను అందిస్తుంది.

మరిచిపోతున్న ప్రదేశంలో నిశ్శబ్ద నిరీక్షణ: అగాపిటో

టాగలాగ్ భాషలో తెరకెక్కిన 'అగాపిటో' అనే ఫిలిప్పీన్స్ లఘు చిత్రానికి అర్విన్ బెలార్మినో, కైలా రొమేరో సంయుక్తంగా దర్శకత్వం వహించారు. కనుమరుగవుతున్న ఒక పాత బౌలింగ్ క్రీడా కేంద్రం నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. నెల చివరి రోజున, మేనేజర్ మీరా తన రోజువారీ పనులను పూర్తి చేసుకుంటూ.. ఒక ప్రత్యేక వ్యక్తి కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఆ వ్యక్తి రాక వెనుక ఓ నిశ్శబ్దమైన భావోద్వేగ భారం దాగి ఉంటుంది. చాలా నిగ్రహంతో కూడిన కథనంతో సాగే ఈ సినిమా.. రోజువారీ దైనందిన జీవితానికీ, అంచనాలకూ మధ్య ఉండే ఆందోళనలను అన్వేషిస్తుంది. అలాగే సాధారణ ప్రదేశాలు, చిన్న చిన్న పనులు కూడా ఆకాంక్షలను, జ్ఞాపకాలను, మానవ సంబంధాలను ఎంత హృద్యంగా దాచి ఉంచగలవో ఈ చిత్రం చూపిస్తుంది.

భవిష్యత్తు నుంచి వచ్చిన వింత హెచ్చరిక: గుడ్ లక్ టూ యూ ఆల్

కెనడియన్ ఫిల్మ్ మేకర్ కోర్డెల్ బార్కర్ దర్శకత్వం వహించిన 'గుడ్ లక్ టు యూ ఆల్' అనే యానిమేటెడ్ లఘు చిత్రం.. సరదాగా సాగుతూనే, కాస్త కలవరపెట్టే కథనాన్ని పరిచయం చేస్తుంది. తన బొమ్మలతో ఊహాలోకంలో మునిగిపోయిన ఒక పాప చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అయితే అనిశ్చిత మైన మానవ భవిష్యత్తుతో అనుసంధానమవుతాననే విషయం ఆమెకు తెలియదు. శాస్త్రవేత్తలు, మేధావుల విభిన్న ఆలోచనలను జోడిస్తూ.. బాల్యంలోని అమాయకత్వానికి, తత్వశాస్త్రపరమైన ఆందోళనకు మధ్య ఈ కథ తిరుగుతుంది. హాస్యం, విస్మయం, హెచ్చరికలను సమపాళ్లలో కలబోస్తూ.. కృత్రిమ మేధ, సాంకేతిక పరిణామం, మానవ పురోగతికి సంబంధించిన అనూహ్యమైన మార్గాలపై ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. యానిమేటర్ అయిన కోర్డెల్ బార్కర్‌కు నేషనల్ ఫిల్మ్ బోర్డ్ ఆఫ్ కెనడాతో అనుబంధం ఉంది. ఆయన రెండుసార్లు ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయ్యారు.

పర్యావరణ సమస్యలనూ, మానవ భావోద్వేగాలనూ, సాంకేతిక పరమైన ప్రశ్నలనూ అద్భుతంగా మేళవిస్తూ.. ప్రారంభ కార్యక్రమంలో ఈ మూడు చిత్రాలను ప్రదర్శించారు. ఇవి ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి ఉన్న వైవిధ్యాన్నీ, ప్రపంచ స్థాయి దృక్పథాన్నీ ప్రతిబింబించాయి. వారం రోజుల పాటు సాగే ఈ సినిమా పండుగకు స్ఫూర్తిదాయకమైన, ఆలోచనాత్మకమైన వాతావరణాన్ని ఈ మూడు చలనచిత్రాల ప్రదర్శన అందించింది. నాన్-ఫీచర్ చిత్రాల కోసం దక్షిణాసియాలో అత్యంత దీర్ఘకాలంగా కొనసాగుతున్న, అతి పెద్ద చలన చిత్రోత్సవంగా ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఎంఐఎఫ్ఎఫ్) గుర్తింపు పొందింది. డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిక్షన్, యానిమేషన్ చిత్ర నిర్మాణ రంగానికి ఒక శక్తిమంతమైన వేదికగా నిలిచింది. 1990లో ప్రారంభమైన ఎంఐఎఫ్ఎఫ్‌ను భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చలన చిత్ర నిర్మాతలు, కళాకారులు, సినిమా ప్రియులను ఆకర్షించే ఒక ప్రతి ష్ఠాత్మక అంతర్జాతీయ వేదికగా ఈ చలనచిత్రోత్సవం ఎదిగింది. 19వ ఎంఐఎఫ్ఎఫ్ గురించి

ఎంపిక చేసిన అంతర్జాతీయ చిత్రాలతో పాటు, పరిశ్రమ కేంద్రక కార్యక్రమాలతో ఉత్సాహవంతమైన, లీనమయ్యే సినిమా అనుభూతిని ఈ 19వ ఎంఐఎఫ్ఎఫ్ అందిస్తుంది.

ఈ ఏడాది చలన చిత్రోత్సవంలో పోటీ పడేందుకు భారత్‌తో సహా 47 దేశాల నుంచి రికార్డు స్థాయిలో 1,459 చిత్రాల ఎంట్రీలు వచ్చాయి.

ఈ ఉత్సవంలో 42కు పైగా భారతీయ భాషలు, 30కి పైగా విదేశీ భాషల్లో రూపొందిన చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఇది ఈ ఉత్సవానికున్న అంతర్జాతీయ స్థాయిని, సాంస్కృతిక వైవిధ్యాన్ని తెలియజేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ చలనచిత్ర దర్శకులు రూపొందించిన కొన్ని అత్యుత్తమ డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలు, యానిమేషన్లతో పాటు నూతన దర్శకులు, విద్యార్థులు రూపొందించిన చిత్రాలను ఈ ఉత్సవంలో ప్రదర్శిస్తారు. సినిమాల ప్రదర్శనతో పాటు.. డాక్ బజార్ రెండో సంచిక, సినీ నైపుణ్యాలను పెంచే మాస్టర్‌క్లాస్ లు, ఐడీపీఏ నిర్వహించే ఓపెన్ ఫోరమ్ లాంటి కార్యక్రమా లు సినిమాపరమైన, సృజనాత్మకమైన ఆలోచనలను మరింత విస్తరింపచేస్తాయి.

# భాషా సేవకుడు... తిరుమల రామచంద్ర

## జూన్ 17... తిరుమల రామచంద్ర జయంతి

పండితుల సొత్తుగా భావించబడే సాహిత్యాన్ని ప్రజాపరం చేయాలనే లక్ష్యంతో, లక్ష్య సిద్ధి కోసం యావజ్జీవం పాటుపడ్డారు తిరుమల రామచంద్ర. తెలుగు సాహిత్యంలో పత్రికా రంగాలలో ఆయన ప్రాతః స్మరణీయులు. ప్రాకృత, సంస్కృతాంధ్ర సారస్వతాల్లో నిష్ణాతునిగా, ద్రావిడ భాషల పరిశోధకునిగా విశిష్ట సేవలందించారు. స్వాతంత్ర్య సమర యోధునిగా, మద్రాసు కుట్రకేసులో ముద్దాయిగా స్వాతంత్ర్య పోరాట కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. సరళమైన, సలక్షణమైన, సహజ సుందరమైన తెలుగు భాషకు పట్టంకట్టి, భావి తరాలకు ముఖ్యంగా పత్రికా రచయితలకు మార్గదర్శకు లయ్యారు. తిరుమల రామచంద్ర స్వయాన వరిష్ఠ పత్రికా రచయిత మాత్రమే కాదు, జగమెరిగిన పండితులు, పరిశోధకులు, విమర్శకులు, బహు భాషావేత్త, బహు గ్రంథకర్త, పత్రికా రచయితగా ఆయన చేసిన భాషాసేవ అనన్య సామాన్యం.

మాతృభాష తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృతం, ప్రాకృతాది భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహు భాషావేత్త. రకరకాల వృత్తులు చేసి, వివిధ అనుభవాలు సంపాదించి విస్తృత లోకానుభవ శాలి ఐన రామచంద్ర తనను తాను వినమ్రంగా భాషా సేవకుడు అని అభివర్ణించు కునేవారు.

బిరుదులు, అవార్డులు, గౌరవ డాక్టరేట్లు ఎన్ని వరించినా కలకత్తా సర్వభాషా పత్రకార్ సమ్మేళనంలో స్వీకరించిన "పత్రకార్ శిరోమణి" అనే బిరుదొక్కటే తమ పేరు ముందు రాసుకోడానికి ఇష్టపడేవారు.

లాహోర్ విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో ఏడాదిపాటు పనిచేసి తెలుగు, కన్నడ, తమిళ, మళయాల తాళపత్ర గ్రంథాలు వెయ్యింటికి వివరణ సూచీ తయారు చేశారు.

అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా రేగటిపల్లె లో 1913, జూన్ 17న జన్మించిన రామచంద్ర హంపీ శిథిలాలలోని గ్రామమైన కమలాపురంలో తన బాల్యం గడిపారు. ఆయన విజయనగర సామ్రాజ్యంలో నివసించిన తాతాచార్యుల వంశీయులు. సంస్కృత భాష, శాస్త్రాలను గురు శుశ్రూష చేసి నేర్చుకోవడం ప్రారంభించాక కారణాంతరాల వల్ల తిరుపతిలోని కళాశాలలో చేరారు. తెలుగు, సంస్కృతాలలో విద్వాన్ గా, హిందీలో ప్రభాకరగా పట్టాలు పొందారు.

స్వాతంత్ర్య సమర యోధునిగా మద్రాసు కుట్ర కేసులో ముద్దాయిగా స్వాతంత్ర్య సమరంలో పాలుపంచు కున్నారు. తిరుపతిలో చదువు

> బిరుదులు, అవార్డులు, గౌరవ డాక్టరేట్లు ఎన్ని వరించినా కలకత్తా సర్వభాషా పత్రకార్ సమ్మేళనంలో స్వీకరించిన "పత్రకార్ శిరోమణి" అనే బిరుదొక్కటే తమ పేరు ముందు రాసుకోడానికి ఇష్టపడేవారు.

తున్నపుడు సత్యాగ్రహంలో పాల్గొని ఏడాది జైలు శిక్ష అనుభవించారు. సహాయ నిరాకరణ సభల కోసం మార్చింగ్ సాంగ్స్ రాశారు.



ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో సైన్యంలో హవల్దార్ గుమాస్తాగా ఆఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్, సరిహద్దుల్లో పని చేశారు. ఆ ఉద్యోగాన్ని ఆత్మ గౌరవానికి భంగం కలిగిన కారణంగా విడిచి పెట్టిన రామచంద్ర ఆ సమయంలోనే ఉత్తర భారత దేశంలో విస్తృతమైన పర్యటన చేశారు. ఉమ్మడి పంజాబులో భాగమైన లాహోర్ పట్టణంలో కొందరు మహా పండితులను, పంజాబు పల్లెల్లో భారతీయ గ్రామీణ జీవితం, మొహెంజదారో, హరప్పా ప్రాంతాల్లో ప్రాచీన నాగరికతా చిహ్నాలను దర్శించారు.

వేటూరి ప్రభాకర శాస్త్రికి ఏకలవ్య శిష్యునిగా చెప్పుకున్న తిరుమల రామచంద్ర, విద్వాన్ విశ్వం వంటి సహాధ్యాయులతో పనిచేశారు. అనంతరం ఢిల్లీ వచ్చి డెయిలీ టెలిగ్రాఫ్ ఆంగ్ల పత్రికలో చేరి పాత్రికేయ వృత్తిలో స్థిరపడ్డారు. 1944 లో పత్రికా రంగంలో పనిచేశారు. తొలుత తెలంగాణ పత్రికలో పనిచేసి తర్వాత మీజాన్ లో చేరి ఆ పత్రిక సంపాదకుడు అడవి బాపిరాజు శిష్యరికంలో రాటుదేలారు.

సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల దంపతులతో ఏర్పడిన సాన్నిహిత్యంతో సోషలిష్టు భావజాలానికి దగ్గరయ్యారు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి, హిందుస్తాన్ సమాచార్ లలో వివిధ హోదాలలో పనిచేశారు. భారతి మాసపత్రిక ఇన్ చార్జ్ ఎడిటర్ గా పనిచేసిన కాలంలో దేవరకొండ బాలగంగాధర తిలక్ వ్యాసం ప్రచురించిన కారణంగా తలెత్తిన భేదాభిప్రాయాలతో రాజీనామా చేశారు. నార్ల వెంకటేశ్వరరావు తో విభేధించి ఆంధ్రప్రభలో ఉద్యోగం వదులు కున్నారు.

పరిశోధన అనే ద్వైమాస పత్రికకు సంపాదకత్వం వహించి 1953-1956 మధ్య కాలంలో ప్రచురించారు. రామచంద్ర కొన్ని వందల వ్యాసాలు సమీక్షలు రాశారు. "హైదరాబాద్ నోట్ బుక్" వంటి 15 శీర్షికలు నిర్వహించారు. సత్యాగ్రహ విజయం నాటకం, రణన్నినాదం గీతాన్ని సంస్కృతంలో రాశారు.

తిరుమల రామచంద్ర తన 84 ఏళ్ళ జీవితంలో అర్ధ శతాబ్ది పత్రికా రచనకే అంకితమైనారు. తెలుగు నాట, భారతావనిలో ప్రసిద్ధులైన కవిపండితులు, కళాకారులు, భాషావేత్తలు, తత్వ చింతకులు అయిన ప్రతిభా శాలురు అనేక మందిని ఆయన ఇంటర్వ్యూ చేశారు. సుమారు 50 పుస్తకాల దాకా ఆయన రచనలు అచ్చైనాయి.

'మన లిపి - పుట్టు పూర్వోత్తరాలు' భాషా చరిత్రకే తలమానికం. ఇతర భాషలలో కూడా ఇలాంటి రచన లేదని" ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు కితాబు ఇచ్చారు. ఆయన ప్రకటించిన 'లలిత విస్తరం' బౌద్ధ వాఙ్మయం నుంచి ఆధునిక భారతీయ భాషలలో తొలి అనువాదం. మహాయాన బౌద్ధ సంప్రదాయానుసారం రాసిన బుద్ధుని జీవిత చరిత్ర ఇది. భారత దేశంలో మొట్టమొదటి లౌకిక వచనంగా దీన్ని పేర్కొన్నారు. క్షేమేంద్రుడి 'అవధాన కల్పలత'ను కూడా ఆయన అనువదించారు. తెలుగులో వీరిదే తొలి అనువాదం.

చిన్నతనం లోనే భారత దేశపు సాంస్కృతిక వైశాల్యాన్ని దర్శించిన రామచంద్ర ఆ కారణంగా తన దృక్పథంలో ఏర్పడ్డ సమ్యక్ దృష్టి, సంస్కృతి పట్ల ప్రేమను జీవితాంతం నిలబెట్టు కున్నారు. నార్ల వెంకటేశ్వరరావుతో విభేదాలు, "భారతి" పత్రికలో ఒక వ్యాసం గురించిన వివాదాలు వంటి సందర్భాల్లో రాజీనామాలు చేసి తన ఆత్మగౌరవాన్ని ప్రదర్శించారు. గాంధీని దర్శించారు. వారితో హరిజనోద్యమంలో పాల్గొన్నారు. ఖద్దరు దుస్తులు కట్టేవారు. నాస్తికునిగా, హేతువాదిగా ప్రకటించుకున్న ఆయనే దేవాలయంలో పూజ చేయడం, ఉన్నవ లక్ష్మీనారాయణ వద్ద సహాయకునిగా పౌరోహిత్యం వంటివి చేశారు. ప్రతి ఉత్తరంలోనూ "ఇట్లు భాషాసేవకుడు తిరుమల రామచంద్ర" అంటూ సంతకం చేసే రామచంద్ర భాషాసేవ లోనే జీవితాన్ని గడిపారు.

పత్రకార శిరోమణి, కళా సరస్వతి, మహా మహోపాధ్యాయ తదితర బిరుదులు ఆయనను వరించాయి. 1991లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లాశాఖ వారిచే అమరజీవి పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం, 1993లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం పొందారు.

తెలుగు నుడికి బడికట్టి, తెలుగు అక్షర రమ్యతను జగతికి చాటిన పరిశోధన 'రాముడు', సారస్వత 'చంద్రుడు' తిరుమల రామచంద్ర 1997 అక్టోబరు 12న తమ 84వ ఏట హైదరాబాద్ లో చివరి శ్వాస వదిలారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

---

# స్కూల్ బస్సులపై రవాణా శాఖ నిఘా

**- విద్యార్థుల భద్రతే లక్ష్యం..**
**- ఫిట్‌నెస్ లేని స్కూల్ వాహనాలపై కఠిన చర్యలు**
**- జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రైత్విరాజ్ వర్మ**



రాజన్న సిరిసిల్ల, జూన్ 16: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రవాణా శాఖ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రైత్విరాజ్ వర్మ ఆధ్వర్యంలో స్కూల్ బస్సులను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాల చెల్లుబాటును అధికారులు పరిశీలించారు. అలాగే డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్, అనుభవం, ప్రథమ చికిత్స పెట్టె, అగ్నిమాపక పరికరం, అత్యవసర నిష్క్రమణ ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్) తదితర భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ ప్రైత్విరాజ్ వర్మ మాట్లాడుతూ, ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపడం, ప్రయాణికుల సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.

---

# ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధికి రూ.15 కోట్లతో ప్రణాళికలు

కరీంనగర్, జూన్ 16: తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయరమణారావు తెలిపారు. ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ పునరుద్దరణ కోసం రూ.10 కోట్ల నిధులు కేటాయించడంతో పాటు ఆలయ ప్రత్యేక నిధులు నుండి రూ.5 కోట్ల (మొత్తం రూ.15 కోట్లతో) అభివృద్ధి పరచడానికి ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు.

ఈ మేరకు మంగళవారం మాస్టర్ ప్లాన్ ను హైదరాబాద్ బొగ్గులకుంటలోని ధార్మిక భవన్ అయిన దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులు, స్థపతి తో సమీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్వామి దేవాలయం పాలక మండలి చైర్మన్ చీకట్ల మొండయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ఆలయ ఈవో సదయ్య, డైరెక్టర్లు, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు

---

# 54వ డివిజన్‌లో ఘనంగా 'బడిబాట' కార్యక్రమం..

## -పాల్గొన్న కార్పొరేటర్ జి. ఉమారాణి



కరీంనగర్, జూన్ 16: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరంలోని 54వ డివిజన్ పరిధిలో గల అంగన్‌వాడీ స్కూల్‌లో మంగళవారం 'బడి బాట' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ బడులలో చేరికలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ జి. ఉమారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో మేలు చేస్తా యని, ఇక్కడ అందించే పౌష్టికా హారం, ప్రాథమిక విద్య పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. అర్హులైన పిల్లలందరినీ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, ఆయా, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బడిబాటలో భాగంగా చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

---

# కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు ప్రముఖ పరిశ్రమ నాయకులు భారత వృద్ధి ఆవిష్కరణల కార్యాచరణపై చర్చలు

హైదరాబాద్, జూన్ 16: హీరో ఎంటర్‌ప్రైజ్ యొక్క ప్రముఖ థాట్ లీడర్‌షిప్ వేదిక అయిన మైండ్‌మైన్ సమ్మిట్ 16వ ఎడిషన్ నేడు న్యూఢిల్లీ లోని తాజ్ ప్యాలెస్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ సమ్మిట్‌లో దేశంలోని ప్రముఖ విధాన నిర్ణేతలు, పరిశ్రమ నాయకులు, ఆర్థికవేత్తలు, దౌత్యవేత్తలు, పెట్టుబడి దారులు, ఆరోగ్య నిపుణులు, ప్రజా మేధావులు పాల్గొని భారతదేశ అభివృద్ధి ప్రయాణంపై విస్తృత చర్చలు జరిపారు.

'అనిశ్చిత సమయాలు ఆత్మవిశ్వాసపూరిత నిర్ణయాలు: భారత్ పునఃసమతుల్యం' అనే అంశంతో నిర్వహించిన ఈ సమ్మిట్‌లో, వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో భారత్ తన ఆర్థిక పునాదులు, సంస్థాగత వ్యవస్థలు, ఆవిష్కరణల పర్యావరణం అభివృద్ధి ప్రాధాన్యతలను ఎలా బలోపేతం చేసుకుంటోందో చర్చించారు. సమ్మిట్ ప్రారంభంలో కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్, హీరో ఎంటర్‌ప్రైజ్ చైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ పాల్గొన్న ప్రత్యేక సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, "బలమైన దేశీయ వినియోగం ప్రపంచ ఆర్థిక అనిశ్చితులకు వ్యతిరేకంగా భారత్‌కు రక్షణగా నిలుస్తోంది.

---

# హైదరాబాద్‌లో ఈ నెల 23 ట్రంప్ రోడ్డు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 16: హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ రోడ్డుకు వచ్చేవారం 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా నామకరణం చేయను న్నారు.

జూలై 4న అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఈనెల 23న రేవంత్‌రెడ్డి ఐటీ కారిడార్‌లోని ఈ రోడ్డును అధికారికంగా ప్రారంభించను న్నారు. ఈ కార్యక్రమానికి అమెరికా రాయబారి సెర్జి యో గోర్ కూడా హాజరవుతారని తెలిసింది.

---

# మతీన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**
**తన జన్మదిన సందర్భంగా ఉదారతను చాటిన ఎం.ఏ మతీన్**
**400మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ**




కరీంనగర్, జూన్ 16: (నేటినిజం ప్రతినిధి) -నగరంలో తరచూ ఏదో ఒక సందర్భంలో సామాజిక కార్యక్రమాలను చేపడుతూ సమాజ సేవ చేస్తున్న మతిన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం నగరంలోని శాస్త్రి రోడ్ లో మతీన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి ప్రముఖ సామాజిక కార్యకర్త ఎం.ఏ మతిన్ జన్మదినం సందర్భంగా నగరంలోని 66 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన, సుమారు 400మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్ళను పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హాజరై మాట్లాడారు. నగరంలోని 66వ డివిజన్ కు చెందిన సామాజిక కార్యకర్త ఎం.ఏ మతిన్ తన జన్మదినం సందర్భంగా ఔదార్యాన్ని చాటడం అభినందనీయమన్నారు.

ప్రస్తుతం అకాడమిక్ ఇయర్ ప్రారంభమైన దృష్ట్యా పేద విద్యార్థులకు పెన్నులు పెన్సిల్లు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్ లను పంపిణీ చేసి ఉదారతను చాటడం హర్షించదగ్గ విషయం అన్నారు. కోవిడ్ 19 లో 615కుటుంబాలకు నెలకు సరిపడా రేషన్ సరుకులను అందించారని గుర్తు చేశారు. కోవిడిలో మృతి చెందిన వారి అంత్రక్రియలను సైతం నిర్వహించార న్నారు. కుల మతాల కతీతంగా అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, ఫుడ్ ఫర్ హంగర్ కార్యక్రమం ద్వారా ప్రతి శనివారం 250 మందికి సరిపడా అంగడిలో ఉచిత భోజన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. గోల్డెన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎంఏ మతినున్న హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిలో 3,500 లీటర్ల ప్యూరిఫైడ్ వాటర్ సిస్టంను విరాళంగా ఇచ్చారని చెప్పారు. రెగ్యులర్గా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. మృత్యువుతో పోరాడే రోగులకు ఉచిత అంబులెన్స్ సర్వీస్ను సైతం అందుబాటులోకి తెచ్చారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే విధంగా మానవసేవయే మాధవసేవ పరమావధిగా శ్రీరామనవమి సందర్భంగా అన్నదానం అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రంజాన్ మాసంలో సైతం ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంతోపాటు వారి మానసిక ఉల్లాసానికి క్రీడలను సైతం నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. పైన పేర్కొన్న కార్యక్రమాలను గడచిన మూడు సంవత్సరాలుగా నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. కిసాన్ నగర్ లో పోచమ్మ గుడి నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చి ఉదారతను చాటారు. మానవాళికి నిదర్శంగా నిలిచిన బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక సేవలో తరిస్తున్న ఎంఏ మతిన్ కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మతిన్ అండ్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాడ వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు పెద్ది వేణు, నగునూరి వేణు, మంద విజయ్, డాక్టర్ అస్మత్, మాడిశెట్టి రాము, తాళ్లపల్లి చిన్న, కీర్తి శ్రీను, డాక్టర్ అబ్దుల్ ఖుద్దుస్, మొహసీన్, అహ్మద్, గోటికార్ ప్రకాశ్, పోలోజు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రజల ఆరోగ్యానికి ఓపెన్ జిమ్‌లు దోహదం

**- మేయర్ కొలగాని శ్రీనివాస్- 45వ డివిజన్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభం**

కరీంనగర్, జూన్ 16: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 45వ డివిజన్ రాజీవ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో, సీఎస్ఆర్ నిధుల ద్వారా మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, యువతలో శారీరక దృఢత్వం పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పార్కులకు వచ్చే ప్రజలు, యువత, మహిళలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమాల అమలుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు నగరపాలక సంస్థ అధికారులు, పాల్గొన్నారు.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.